గురువారం
01-01-2026
విజయవాడ ప్రచురణ
సంపుటి : 74, సంచిక : 191
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

8న రాష్ట్ర కేబినెట్ భేటీ

విశాలాంధ్ర-సచివాలయం: నూతన సంవత్సరంలో ఏపీ మంత్రి మండలి తొలి సమావేశం జరగనుంది. జనవరి 8న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం కానుంది. కేబినెట్ సమావేశం నేపథ్యంలో 6వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని వివిధ శాఖలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మెమో జారీ చేశారు. సమావేశంలో మంత్రిమండలి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. భూ కేటాయింపులు, అమరావతి నిర్మాణం, పథకాల అమలుపై సమీక్ష, భవిష్యత్ పెట్టుబడుల ప్రణాళికలు, విద్య, రోడ్లు, రవాణా వంటి అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చ జరగనుంది.

భారీ ఉగ్రకుట్ర భగ్నం

జైపూర్: భారీ ఉగ్రకుట్రను రాజస్థాన్ పోలీసులు భగ్నం చేశారు. 150 కిలోల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నూతన సంవత్సరం వేళ రాజస్థాన్‌లో పెద్దఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలు తరలిస్తుండగా పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి

- మిగతా 2 లో

'నిమెసులైడ్' అధిక డోసుపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: ప్రముఖ పెయిన్‌కిల్లర్ ఔషధం నిమెసులైడ్ తయారీ, విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నోటి ద్వారా తీసుకొనే ఈ ఔషధం అధిక డోసులపై నిషేధం విధించింది. ఆరోగ్యపరమైన భద్రతా కారణాల రీత్యా నిమెసులైడ్ 100 ఎంజీకి మించి డోసు ఉండే ఔషధాల తయారీ, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఈ మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుతో చర్చించిన అనంతరం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. '100 ఎంజీ కంటే అధిక డోసు ఉండే నిమెసులైడ్ తీసుకోవడం వల్ల మనుషుల ఆరోగ్యానికి ప్రమాదం

- మిగతా 2 లో

వొడాఫోన్-ఐడియాకు

రూ.87,695 కోట్ల ఊరట

- మహారాష్ట్రలో ఆరు లేన్ల కారిడార్‌కు రూ.19,142 కోట్లు
- ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్-ఐడియా(వీఐ)కు కేంద్ర కేబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఏజీఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలు ఫ్రీజ్ చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 2032-41 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో ఆరులేన్ల నాసిక్-సోలాపూర్- అక్కల్కోట్ కారిడార్ నిర్మాణానికి ఆమోతం తెలిపింది. ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టుకు అంగీకరించింది. వొడాఫోన్-ఐడియా (వీఐ)కు ఊరట కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ మొత్తాన్ని ఆ టెలికాం సంస్థ ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా

- మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

పీఎంశ్రీ విజయవంతం కావాలి

ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు

సీఎస్‌ల సమావేశంలో ప్రధాని మోదీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీఎం శ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా)పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. వివిధ జాతీయ ప్రాజెక్టులు, పీఎంశ్రీ తదితర అంశాల ప్రగతికి సంబంధించి బుధవారం దిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యంపై దాడి

- ఉద్యమించినందుకు విద్యార్థి, యువజన సంఘాల నేతలపై రౌడీ షీట్లా?
- కూటమి ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ఠ
- చాపకింద నీరులా ఎస్ఓపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రశ్నించడం నేరంగా, ఉద్యమించడం అపరాధంగా మలిచే ప్రమాదకర రాజకీయ సంస్కృతి రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తోంది. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటే పీడీ కేసులు, రాజ్యాంగబద్ధంగా నిరసనలకు దిగితే..రౌడీ షీట్లు తెరుస్తూ భయభ్రాంతులకు గురిచేసేలా కూటమి ప్రభుత్వ పాలన ఉంది. ఈ బెదిరింపులకు ప్రజాస్వామ్యం బెదరబోదని, ప్రజల గొంతు నులిమితే ఉద్యమాల ప్రతిధ్వని మరింత బలంగా వినిపిస్తుందన్న చారిత్రక సత్యాన్ని ఈ ప్రభుత్వం మరిచిపోతోందని ఉద్యమకారులు నొక్కిచెబుతున్నారు. విశాఖలో బైజూస్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలపై రౌడీ షీట్లు తెరవడం... ఈ అణచివేత రాజకీయాలకు పరాకాష్ఠగా మారింది. నాడు విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడిన యువజన, విద్యార్థి సంఘాల నేతలపై రౌడీ షీట్లు పెట్టిన సంఘటనపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది. ఇది..కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశించిన ప్రమాణిక కార్యాచరణ విధానం(ఎస్ఓపీ) అమలులో భాగమని వామపక్ష విద్యార్థి సంఘాలు స్పష్టంగా చెబుతున్నాయి. చాపకింద నీరులా దీన్ని అమలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఫీజు

- మిగతా 2 లో

కార్మిక వ్యతిరేక విధానాలపై

సమరశీల ఐక్య పోరాటాలు

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

సీఐటీయూ అఖిలభారత మహాసభ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు శక్తివంతమైన సమరశీల ఐక్య పోరాటాలు చేపట్టాలని సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభ పిలుపునిచ్చింది. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 18వ అఖిల భారత మహాసభలు బుధవారం విశాఖపట్నంలో ప్రారంభమైంది. ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్న మహాసభలను సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత యూనియన్ పతాకం ఎగురవేసి ప్రారంభించారు. గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడి హత్యకు గురైన పెంచలయ్య ఆశ యాలను కొనసాగిస్తామని ఆయ న కుటుంబ సభ్యులు తీసుకొచ్చి న జ్యోతి స్ఫూర్తి నింపింది. ఆహ్వాన సంఘం చైర్మన్ సీహెచ్ నరసింగరావు ప్రారంభ

- మిగతా 2 లో

వెల్లువెత్తిన నిరసనలు

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై రౌడీ షీట్ ఎత్తివేయాలని డిమాండ్

- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- గుంటూరులో కళ్లకు గంతలు, చేతులకు సంకెళ్లతో వినూత్న నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/గుంటూరు కలెక్టరేట్ : ప్రజాసమస్యలపై ఉద్యమిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలపై రౌడీషీట్‌లు తెరవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆందోళనలు నిర్వహించాయి. గుంటూరు, విజయవాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో బుధవారం నిరసనలు కొనసాగాయి. కొన్ని చోట్ల విద్యార్థి, యువజన సంఘాల నేతలు మీడియా ముఖంగా కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడల్ని తూర్పారబట్టారు. విద్యార్థి సంఘాల నేతలపై పెట్టిన రౌడీషీట్‌లను తక్షణమే తొలగించాలని నేతలు నినదించారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విజయవాడ

- మిగతా 2 లో

ప్రక్షాళనకు శ్రీకారం
వనతి గృహాల్లో మౌలిక వసతులపై దృష్టి
2లో

ఇదీ లోకం!

జాగ్రత్త బిడ్డా... చితకేసేస్తారు!

చంద్రబాబుపై కేసుల వివరాలు

సమర్పించండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమోదయిన కేసుల రికార్డులకు సంబంధించి కోర్టు తీర్పు ప్రతులు ఇవ్వాలంటూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణరాజు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు తమకు సమర్పించాలంటూ ఏపీ సీఐడీని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇదే అంశంపై ఆయన ఏసీబీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... తీర్పు ప్రతులు ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దీంతో ఏసీబీ ప్రత్యేక కోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తాజాగా హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్‌లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వం కేసులు

- మిగతా 2 లో

ప్రళయ్ పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: దేశీయంగా తయారు చేసిన ప్రళయ్ క్షిపణుల పరీక్ష విజయవంతమైంది. బుధవారం ఉదయం 10.30 గంటలకు చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ సమీపంలో ఈ రెండు క్షిపణులను పరీక్షించినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటన చేసింది. రెండు క్షిపణులు నిర్దేశిత లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయని వెల్లడించింది. క్షిపణి వ్యవస్థ సంసిద్ధత, సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపింది. ప్రళయ్ అనేది సాలిడ్ ప్రొపెలెంట్, క్వాసీ బాలిస్టిక్ క్షిపణి. దీనిని దేశీయ పరిజ్ఞానంతో అధునాతన నేవిగేషన్ వ్యవస్థలతో తయారు చేశారు. వివిధ రకాల వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లడం, నిర్దేశిత లక్ష్యంపై కచ్చితంగా దాడి చేయగల సామర్థ్యం ప్రళయ్‌కు ఉన్నదని రక్షణ శాఖ పేర్కొంది. డీఆర్‌డీఓ లేబరలేటరీలు, భారత పారిశ్రామిక భాగస్వామ్యులతో కలిసి హైదరాబాద్‌లోని పరిశోధన కేంద్రం 'ఇమారత్' ఈ క్షిపణిని తయారు చేసింది. పరీక్షల కోసం ఇంటిగ్రేటెడ్

- మిగతా 2 లో

భారీ ఉగ్రకుట్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించామని, వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా 200 కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వినియోగించాలనుకున్నారా? తదితర వివరాలు రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

'నిమెసులైడ్' అధిక డోసుపై కేంద్రం నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

కలిగే అవకాశం ఉంది. దీనికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అందుకే దీన్ని తక్షణమే నిషేధిస్తున్నాం' అని ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిమెసులైడ్ అధిక డోసు ఉండే ఔషధం తయారీ, విక్రయాలు, పంపిణీపై ఈ నిషేధం వర్తించనుంది. తక్కువ డోసు ఫార్ములా ఉన్న నిమెసులైడ్ ఎప్పటిలాగే మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. నిమెసులైడ్ అనేది నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్. దీనివల్ల దుష్ప్రభావాలు ఉన్నట్లు కొంతకాలంగా చర్చ జరుగుతోంది. కాలేయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గతంలో నిపుణులు హెచ్చరించారు. దీంతో కేంద్రం దీని వినియోగంపై ఆంక్షలు విధించింది. కేంద్రం నిర్ణయంతో నిమెసులైడ్ ఆధారిత పెయిన్ కిల్లర్ బ్రాండ్లను తయారుచేసే ఫార్మా కంపెనీలు వెంటనే తమ ఉత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుంది. మార్కెట్లోకి ఇప్పటికే పంపిన ఈ ఔషధాలను రీకాల్ చేయనున్నారు. గతంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇలా ఆరోగ్యపరమైన భద్రతా కారణాలతో కొన్ని అధిక డోసు ఔషధాలు నిషేధించింది.

'ప్రళయ్' పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థలుగా, తయారీ-ఉత్పత్తి భాగస్వాములుగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వ్యవహరించాయి. ఈ పరీక్ష విజయంతో డీఆర్‌డీఓ, సాయుధ దళాలు, రక్షణ పరిశ్రమలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. డీఆర్‌డీఓ చైర్మన్, ఆర్ అండ్ డీ శాఖ కార్యదర్శి సమీర్ వి కామత్ కూడా హర్షం వ్యక్తంచేశారు.క్షిపణి వ్యవస్థ త్వరలోనే సాయుధ దళాల్లో చేరబోతోందన్నారు. పరీక్షలకు డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్తలు, వైమానిక దళం, సైన్యం ప్రతినిధులు, పరిశ్రమల అధికారులు హాజరయ్యారు. ఈ పరీక్షతో భారత క్షిపణి సామర్థ్యం మరింత పెరిగిందని అభినందించారు.

ఇస్రో మరో ముందడుగు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ముందడుగేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) మూడో దశను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్‌వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలోకి చిన్న ఉపగ్రహాలను వేగంగా ప్రయోగించడం కోసం దీనిని రూపొందించారు. అధిక స్థాయిలో ఉత్పత్తికి ఇది అనుకూలంగా ఉంటుంది. పేలోడ్‌కు సెకనుకు 4 కిలోమీటర్ల వేగాన్ని అందించడంలో ఎస్ఎస్-3 కీలకపాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన అప్‌గ్రేడ్‌లు ఈ దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉపగ్రహాల సామర్థ్యం, నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఒత్తిడి, థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్యుయేటర్ పనితీరు వంటి విషయాలను పరిశీలించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

సమరశీల ఐక్య పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉపన్యాసం చేస్తూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారా మరాజు స్ఫూర్తితో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాడుతోందని తెలి పారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పంబిస్ కీర్టిస్ మాట్లాడుతూ భారతదేశ కార్మిక వర్గం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరే కంగా తీవ్రంగా పోరాడుతోందని ప్రశంసించారు. కార్మికులు, కర్షకులు కలిసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు ప్రకటించారు. కార్మిక హక్కుల రక్షణ కోసం చేస్తున్న పోరాటంలో సీఐటీయూ ఒంటరి కాదని, ప్రపంచ కార్మిక సంఘాల మద్దతు ఉంటుందని ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని అమ్మాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా నిరసించారు. స్టీల్ ప్లాంట్ రక్షణకు పోరాడుతున్న కార్మికులను అభినందించారు. ఈ మహాసభలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఐఎన్‌టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, హెచ్ఎంఎస్ నేత సుదర్శన్ రావు, ఏఐసీటీయూ వైస్ ప్రెసిడెంట్ క్లిఫ్టన్ డి రోజారియో, ఏఐయూటీసీ సెక్రటేరియట్ సభ్యుడు జయసేన్ మెహర్, యూటీయూసీ నేత షేకిజార్ అపాస్వామి, ఎస్ఈడబ్ల్యూఏ వైస్ ప్రెసిడెంట్ సోనియా జార్జ్ తదితరులు ప్రసంగించారు.

ప్రక్షాళనకు శ్రీకారం

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్రంలో వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఆయా హాస్టళ్లల్లో పరిపాలన వ్యవస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోఎస్సీ బాలుర వసతి గృహాలు 608, బాలికల వి 350, ఎస్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు కలిపి 635, బీసీ వసతి గృహాలు 1,137 ఉన్నాయి.. వసతి గృహాల్లో రోజువారీ మెనూను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఆయా సమయాల్లో మెనూలో పేర్కొన్న ఆహార పదార్థాలు విద్యార్థులకు అందజేయాలని, ఆహార తయారీ, వడ్డన ప్రక్రియను హాస్టల్ అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించి ఆహార పదార్థాల నాణ్యతాప్రమాణాలు తెలుసుకోవాలని ఆదేశించింది. లోపం ఉంటే వెంటనే సరిదిద్దాలని, అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్యుల సలహా మేరకు ప్రత్యేకంగా వారు కోలుకోడానికి పోషకాహారం పెట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నెలవారీ ఆరోగ్య తనిఖీలు, అనారోగంతో ఉన్న విద్యార్థులకు తక్షణ వైద్య చికిత్స, ఆరోగ్య అవగాహన శిబిరాలు, మానసిక సమస్యల నివారణకు కౌన్సెలింగ్ నిర్వహణ వంటి అంశాలను ప్రస్తావించింది. సురక్షిత నీటిని సరఫరా చేయడంతోపాటు పారిశుద్ధ్య నిర్వహణలో చేపట్టాల్సిన అంశాలపై సమగ్రంగా వివరిస్తూ మార్గదర్శకాల్లో రూపొందించింది. మొక్కల పెంపకం, కిచెన్ గార్డెన్, వసతి గ ృహాల మరమ్మతులు, నిర్వహణ, విద్యార్థుల భద్రత, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, తనిఖీలతోపాటు సంస్థాగత గ్రేడింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. విద్యార్థుల చదువుకుసంబంధించి మార్కుల ఆధారంగా ఏ నుంచి డీ వరకు నాలుగు గ్రేడ్లుగా విభజించింది. వసతి గృహాల అధికారులకు పనితీరుకు గ్రేడ్స్ ఇవ్వనుంది. జీపీఎస్‌ఈ అనుసంధానం చేస్తూ ఉద్యోగం చేస్తున్న ప్రాంతం నుంచి లైవ్ ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించింది. ఫిర్యాదులను పరిష్కరిం చడానికి యూజర్ ఫ్రెండ్లీ సేవను ప్రారంభించాలని పేర్కొంది. రాష్ట్రంలో 840 సాంఘిక సంక్షేమ వసతి గ ృహాల్లో విద్యుత్తు, మూత్రశాలలు, ఫ్లోరింగ్, తాగునీరు, ప్రహరీలు వంటి మౌలిక వసతులు కల్పించింది. ఇందుకోసం రూ.143 కోట్లు వెచ్చించింది. కొన్ని జిల్లాల్లోని హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నది ప్రాథమిక నివేదిక. కొన్ని చోట్ల మౌలిక వసతుల లేమి, శిథిల భవనాల్లోనే నెట్టుకురావడం, అద్దెభవనాల్లోనే కొనసాగడం వంటి సమస్యలను గుర్తించారు. వీటినంత త్వరగా ఈ అడ్డంకులను అధిగమించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ప్రకాశం, కర్నూల్ జిల్లాల్లో కొన్ని పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. నీరు, విద్యుత్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలో ఎస్టీ వసతి గృహాల్లో ... శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని వివిధ బీసీ వసతి గృహాలకు నేటికీ సొంతగూడు లేదు. అద్దె భవనాల్లో ఇరుకైన గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పారదర్శకత కోసం విద్యార్థులకు ముఖ గుర్తింపును తప్పని సరి చేసింది. వారి సంరక్షణ నిమిత్తం సీసీ కెమేరాల ఏర్పాటుకు సంకల్పించింది. వివిధ ఎస్సీ, ఎస్టీ బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ముస్తాబు కార్యక్రమం ఇంకా అమలుకావడం లేదని విద్యార్థులే చెబుతున్నారు. విద్యార్థులకు అందాల్సిన కిట్లు చేరలేదు. వివిధ వసతి గృహాల్లో ఆహారం కలుషితమై అనేక మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో ఇటువంటి ఘటనలు జరగకుండా నిర్దిష్ట ప్రామాణిక విధానాలను అమలు చేయాలని, విద్యార్థుల భద్రత, ఆహారం, నీటి పరిశుభ్రత వంటి అంశాలపై దృష్టికేంద్రీకరించాలని ఆదేశించింది. కానీ... ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో లోపాలు కొనసాగుతుండడం ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీసేవిధంగా ఉండడంతో ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ఈ లోపాలను అధిగమించడానికి, విధానాలను ఖచ్చితంగా పాటించేలా ఆయా పాఠశాలలు, హాస్టళ్ల అధికారులే సంపూర్ణ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ ప్రతి నెలా రెండు వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొంది.

అప్పులపై జగన్ తప్పుడు లెక్కలు: విజయ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్ర అప్పులపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్, సాక్షి పత్రిక... ప్రజలను గందరగోళానికి గురిచేసే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్, టీడీపీ ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రూ.1.19 లక్షల కోట్ల అప్పును రూ.2.93 లక్షల కోట్లుగా చూపించడం పూర్తి అబద్ధమన్నారు. ఆర్థిక అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రం అప్పులు చేయాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి అనంతరం మాత్రమే ఆర్బీఐ ద్వారా బాండ్లు జారీ చేయాల్సి ఉంటుందని, ఈ అప్పులన్నింటినీ కాగ్ (కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నెలనెలా అధికారికంగా ప్రకటిస్తుందని తెలిపారు. 'కాగ్ లెక్కల ప్రకారం 2024-25లో అప్పులు రూ.81,597 కోట్లు. ఇందులో 2024, ఏప్రిల్, మేలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులు రూ.38,700 కోట్లు. కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు రూ.42,897 కోట్లు మాత్రమేనని' వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం (నవంబరు 2025 వరకు) కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు రూ.77,040 కోట్లు. మొత్తం అప్పు రూ.1,19,937 కోట్లు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. రూ.2.93 లక్షల కోట్ల అంకె జగన్ ఎక్కడి నుంచి తెచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరే షన్లు, స్వతంత్ర సంస్థలు తీసుకున్న అప్పులను రాష్ట్ర ప్రభుత్వ అప్పులుగా కలిపి చూపడం, సీఆర్డీఏ మార్క్‌ఫెడ్, అమరావతి నిర్మాణ రుణాలను ప్రభుత్వ అప్పుల్లో చేర్చడం, వర్కింగ్ క్యాపిటల్ లోన్లను కూడా ప్రభుత్వ అప్పులుగా ప్రచారం చేయడం... ఆర్థిక సూత్రాలకు, బిజినెస్ రూల్స్‌కు పూర్తిగా విరు ద్ధమని పేర్కొన్నారు. సీఆర్డీఏ అప్పులు అమరావతి రాజధాని నిర్మాణం కోసం తీసుకున్నవని, వాటిని సీఆర్డీఏ సంస్థే తీరుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వంపై భారం కాదని స్పష్టం చేశారు.

18 నెలల్లోనే 90 శాతం హామీల అమలు: అశోక్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో దాదాపు 90 శాతం అమలు చేసినట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాల యంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం, శాంతి భద్రతల వైఫల్యాల నుంచి అభివృద్ధి బాట పట్టించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదేనని స్పష్టం చేశారు. జగన్... ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని, సంక్షేమం పేరుతో చేసింది శూన్యమని విమర్శించారు. బటన్ నొక్కడం పేరుతో లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించారని, చివరి ఏడాది బాకీలతోనే పాలన సాగిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తూ 'డబుల్ ఇంజిన్ సర్కార్' అంటే ఏమిటో ప్రజలకు చూపించిందన్నారు. గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను మడత పెట్టగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల మెగా డీఎస్సీ పోస్టులను భర్తీ చేసిందన్నారు. 'తల్లికి వందనం' ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి వర్తింపజేసి 67 లక్షల మంది తల్లులకు లబ్ధి చేకూర్చిందన్నారు. పింఛన్ల విషయంలోనూ కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్నామని, దీనికి ఏటా రూ.1,100 కోట్ల ఖర్చు అవుతున్నా ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదన్నారు.

పీఎంశ్రీ విజయవంతం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శులతో 50వ వీడియో సమావేశం నిర్వహించారు. ప్రధాని మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకం పీఎంశ్రీని విజయవంతంగా అమలు చేయడం ద్వారా పాఠశాలలను ఆధునీకీకరించి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020కి అనుగుణంగా నమూనా పాఠశాలలుగా తీర్చిదిద్ది, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తేవడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని దిశానిర్దేశం చేశారు. దీని కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించడంపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం,ఆధునిక వసతులు కల్పించడం ముఖ్య లక్ష్యంగా చెప్పారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చడం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, డిజిటల్ విద్య, మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎన్ఈపీ-2020 (జాతీయ విద్యా విధానం) అమలులో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందని ప్రధాని స్పష్టం చేశారు. డిజిటల్, గ్రీన్ స్కూళ్ల అభివృద్ధి స్మార్ట్ క్లాసులు, డిజిటల్ ల్యాబ్‌లు, ఆధునిక సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీలు,క్రీడలు,ఆర్ట్స్, వోకేషనల్ ఎడ్యుకేషన్ ను మెరుగు పర్చడం జరుగుతుందన్నారు. ఈ వీడియో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పీఎంశ్రీ పథకం కింద 935 పాఠశాలలు ఎంపిక కాగా వాటిని అన్ని విధాలా మెరుగైన రీతిలో అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ సాంకేతికతతో కూడిన విద్యను అందిస్తున్నామని వివరించారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలన్నిటికి పక్కా భవనం, విద్యుత్ సరఫరా ఉండేలా చూడడంతో పాటు బాలికలు, బాలురకు వేరువేరు మరుగుదొడ్లు, సురక్షితి మంచినీటి సౌకర్యం, ప్రత్యేక హ్యాండ్ వాషింగ్ సౌకర్యం, గ్రంథాలయం, క్రీడా పరికరాలు వంటివి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్, ప్లే గ్రౌండ్, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారి హాజరును చైల్డ్ ట్రాకింగ్ సాఫ్ట్‌వేర్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో పీఎంశ్రీ పథకాన్ని విజయవతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధానికి సీఎస్ విజయానంద్ వివరించారు. ఈవీడియో సమావేశంలో ఎస్పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వొడాఫోన్-ఐడియాకు రూ.87,695 కోట్ల ఊరట

(మొదటిపేజీ తరువాయి)

ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది భారీ ఊరట. మారటోరియం పీరియడ్‌కుగాను బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 2025-26 నుంచి 2030-31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనమయ్యాయి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవడంతో కేబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో నాసిక్- సోలాపూర్- అక్కాల్కోట్‌ను కలుపుతూ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ అంగీకరించిందన్నారు. బీఓటీ (టోల్) మోడ్‌తో 374 కిమీల ఈ ప్రాజెక్టు నాసిక్, అహిల్యానగర్, సోలాపూర్‌ను కర్నూల్ (ఏపీ)తో అనుసంధానం చేస్తుందని తెలిపారు. నాసిక్ నుంచి అక్కల్కోట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను వధావన్ పోర్టు ఇంటర్‌చేంజ్ వద్ద ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌ను కలిపే విధంగా ప్రతిపాదన చేశారు. నాసిక్ వద్ద ఆగ్రా-ముంబై కారిడార్‌ను ఎన్‌హెచ్ 60 (అడెగావ్) వద్ద జంక్షన్‌తో... నాసిక్ సమీపంలో పంగ్రీ వద్ద సమృద్ధి మహామార్గ్‌ను అనుసంధానం చేసేదిగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. వెస్ట్‌కోస్ట్ నుంచి ఈస్ట్ కోస్ట్ వరకు అనుసంధానికి ఈ ప్రతిపాదన చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. చెన్నై నుంచి హోసాపూర్ (ఎంహెచ్ బార్డర్) వరకు తిరువల్లూర్, రేణిగుంటా, కడప, కర్నూలు (700 కిమీల పొడవైన) మీదుగా నాలుగు లేన్ల కారిడార్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపింది. మహారాష్ట్రలో ఆరులేన్ల కారిడార్ పూర్తైతే ప్రయాణ సమయం 31 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుందని ప్రకటన పేర్కొంది. 251.06 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి... 313.83 లక్షల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని వెల్లడించింది. ప్రతిపాదిత కారిడార్ పరిధిలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే క్రమంలో నూతన ఉపాధి అవకాశాలకు అవకాశం ఉంటుందని ప్రకటన తెలిపింది. ఇదిలావుంటే, ఒడిశాలో ఎన్‌హెచ్-326 బలోపేతానికి, విస్తరణకు కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. రెండు లేన్ల రోడ్డు నుంచి రెండు లేన్ల రాజధానిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1,526.21 కోట్లు కాగా ఇందులో నిర్మాణ ఖర్చు రూ.966.79 కోట్లుగా ఉన్నట్లు ప్రకటన తెలిపింది. గజపతి, రాయగడ, కోరాపుట్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ప్రయోజకరమని వెల్లడించింది.

చంద్రబాబుపై కేసుల వివరాలు సమర్పించండి

(మొదటిపేజీ తరువాయి)

నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఫైబర్ నెట్ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సైతం సీఐడీ మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్ అంటూ నోటీసు జారీ చేసింది. దీంతో ఆయా కేసుల మూసివేతకు సంబంధించిన రికార్డులు, కోర్టు తీర్పు ప్రతులు పూర్తి వివరాలతో తనకు అందించాలంటూ సువర్ణరాజు ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దానిని ఏసీబీ కోర్టు తిరస్కరించగా... హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం ఈ కేసు విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

వెల్లువెత్తిన నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆందోళన చేసిన నాయకులపై అప్పటి ప్రభుత్వం కేసు పెట్టిందని గుర్తుచేశారు. రెండేళ్ల తర్వాత పాత కేసులన్నీ తిరగదోడి విద్యార్థి యువజన నాయకులపైన విశాఖలో రౌడీషీట్ తెరిచారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉండగా... అధికారంలోకి వస్తే పాత కేసులు తొలగిస్తామని...అనేక సభలు, సమావేశాలలో విద్యార్థి సంఘాల నేతలకు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్... అధికారంలోకి వచ్చాక అణచివేసే ధోరణితో వ్యవహరించడం తగదన్నారు. విజయవాడలో మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు, గుజ్జుల వలరాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తోందని ఆగ్రహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అందించాలని విద్యార్థి, యువజనులు నిరుద్యోగుల తరఫున ఉద్యమించిన నాయకులు నాగరాజు, అచ్యుతరావు, రాంబాబు, సాయిబాబు, ఎల్లయ్యపై నమోదు చేసిన రౌడీ షీట్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కార్తీక్, చీకటి సైదారావు, గాడి అజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతపురంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కోటేశ్, శ్రీసత్యసాయి జిల్లాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మూర్తి, అనకాపల్లిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జీ, ఫణీంద్ర నిరసనలకు నాయకత్వం వహించారు. గుంటూరులో జరిగిన నిరసనలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శి అమర్నాథ్, నగర నాయకులు అజయ్, సతీశ్, వెంకట్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ కోసం జరిగిన విద్యార్థి, యువజన ఉద్యమాలే ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేశాయన్న విమర్శలున్నాయి. అందుకే ఆ ఉద్యమాలను అణచివేయడానికి రౌడీషీట్లు తెరవడం వంటి దుర్మార్గపు పద్ధతులుఎంచుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం అనంతరం ఎన్ఓపీ అమలు మరింత వేగవంతమైంది. సీపీఎం అనుబంధ రైతు సంఘం నేత ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేసిన ఘటనతోనూ చంద్రబాబు ప్రభుత్వ వైఖరి తేటతెల్లమైంది.

వారిపై కేసులేవీ?

ఎన్నికల సమయంలో యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితేనే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు...ఉల్లం నాగరాజు, కెంగువ అచ్యుతరావు, ఎర్రిసిల్లి రాంబాబు, ఎర్రిసిల్లి సాయిబాబు, గుర్రాల ఎల్లయ్యపై రౌడీషీట్‌లు తెరిచారు. కేసుల నమోదుతో ఉద్యమకారులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యంగా కన్పిస్తోంది. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను గుర్తు చేసిన విద్యార్థి, యువజనులపై పాత కేసుల సాకుతో రౌడీ షీట్లు తెరవడం కక్షసాధింపు రాజకీయాలకు నిదర్శనం. అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలైన తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ బైజ్యూస్‌కు వ్యతిరేకంగా చేసిన నిరసనలపై ఎందుకు పీడీ యాక్టులు పెట్టలేదో, రౌడీ షీట్లు ఎందుకు తెరవలేదో ఈ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. బీజేపీ అనుబంధ యువమోర్చా తదితర సంఘాలు ఆందోళన చేయగా, వారిపై కేసులు ఎక్కడా పెట్టకపోవడంతో చంద్రబాబు ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోంది. 50 ఏళ్లలో దేశంలో జరిగిన ప్రజా ఉద్యమాలు, నిరసనలపై ఒకే ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బీపీఆర్‌కి ఆదేశాలు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారనుంది. పాత కేసులను ఒక్కొక్కటిగా వెలికి తీసి, పీడీ యాక్టులు, రౌడీ షీట్ల పేరుతో అక్రమ కేసుల పరంపరను ప్రారంభిస్తున్నారు. దీనికి ఆదిలోనే అడ్డుకట్ట వేయకుండా రాబోయే రోజుల్లో కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక ఉద్యమకారులపైనా కేసులు పెట్టే ప్రమాదముంది.

ఉక్కు నుంచి వైద్యకళాశాలల వరకు ప్రైవేట్ పరం

ప్రజల సంపదను ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన ప్రభుత్వం, అదే సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడంలో మునిగిపోయింది. ప్రభుత్వ వైద్యకళాశాలలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేటీకరణ వైపు నడిపిస్తూ... సామాన్య ప్రజల వైద్య హక్కులపై దాడి చేస్తోంది. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయాలన్న కుట్ర కొనసాగుతూనే ఉంది. పైకి మాత్రం 'ఉక్కును కాపాడుతాం' అంటూ ప్రజలను మభ్యపెట్టడం ఈ కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఈ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నలు ఎదురైతే సమాధానాలు చెప్పే రాజకీయ ధైర్యం లేక, అణచివేతనే ఆయుధంగా ఎంచుకుంది. ఇప్పటివరకు మంత్రి నారా లోకేశ్ కనుసన్నల్లో సాగిన రెడ్‌బుక్ రాజకీయ ప్రతీకారానికి తోడుగా ఇప్పుడు కేంద్రం ఆదేశించిన ఎన్ఓపీ చట్టబద్ధ ముసుగుగా మారిందన్న విమర్శలున్నాయి. విద్యార్థి సంఘాల జేఏసీతో మంత్రి నారా లోకేశ్ నవంబరు 21వ తేదీన జరిపిన భేటీలో ఏఐఎస్ఎఫ్ నేతలు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై విజయవాడ దాసరిభవన్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు మీడియా ముఖంగా చర్చలు విఫలమైనట్లు ప్రకటించారు. ఆ తర్వాత విజయవాడ ధర్నా చౌక్‌లో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి పోరు నిర్వహించారు. దానికితోడు ఏఐవైఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ క్యాలెండరు విడుదల, నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ ఉద్యమించారు. వాటిని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులను ఇప్పుడు బయటకు తీయడం వెనుక కుట్ర దాగి ఉంది. ఒక వైపు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థి సంఘాల నేతలపై ఎలాంటి కేసులు పెట్టబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇలా రౌడీషీట్లు తెరవ డంపైనా వామపక్ష, ప్రజా సంఘాలు తప్పుపడుతున్నాయి. ఇకపై ఎవరు ప్రశ్నించినా ఇదే గతి అన్న హెచ్చరికను చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు పంపుతోందని, ప్రజల పోరాటాలను ముందుగానే అణచివేయాలన్న వ్యూహంలో భాగమే ఈ చర్యలన్న విమర్శలున్నాయి. వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమకారులనే లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయించి ఉద్యమాలను పలచన చేయాలన్న దురాలోచన కూటమి ప్రభుత్వ అజెండాగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా వెనక్కిత గ్గి విద్యార్థి, యువజన నేతలపై పెట్టిన రౌడీ షీట్లు, రైతు నేతపై పెట్టిన పీడీ యాక్ట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరిస్తున్నాయి. లేకుంటే 2026 ఒక ఉద్యమ ఏడాదిగా మారుతుందని పేర్కొంటున్నాయి.

ప్రజల అభ్యున్నతి కోసం ఉధృత పోరాటాలు

నిర్బంధాలకు బెదరం... రౌడీషీట్లకు అదరం

ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రజల హక్కులను పరిరక్షించేందుకు, సహజ వనరులను కాపాడుకునేందుకు, రైతులు, కార్మికులు, దళితులు, బడుగు, బలహీనవర్గాల పక్షాన ఈ నూతన సంవత్సరంలోనూ తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. 2025లో సీపీఐ ఎన్నో విజయాలు సాధించిందని గుర్తుచేశారు. సామాజిక పెన్షన్ల పెంపు కోసం సాగించిన పోరాటాల ఫలితంగా నేడు రూ.4 వేలకు పెంచి ప్రభుత్వం అమలు చేస్తోందని గుర్తుచేశారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్కే హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జనవరి 18న ఖమ్మంలో జరగనుందని, ఈ సభకు జాతీయ నాయకత్వంతో పాటు 30 దేశాల కమ్యూనిస్టు అగ్రనేతలు హాజరుకానున్నట్లు ముప్పాళ్ళ నాగేశ్వరరావు వెల్లడించారు. పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది పార్టీ శ్రేణులు తరలివస్తారన్నారు. ఉద్యమకారుల వివరాలు సేకరించాలని డీజీపీలకు మోదీ ప్రభుత్వం లేఖ రాయటం నియంతృత్వానికి అద్దంపడుతోందన్నారు. అభివృద్ధిలో భారత్ దూసుకుపోతోందని మోదీ సర్కారు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ అధికారం చేపట్టే నాటికి డాలర్ విలువ రూ.63 ఉంటే... ప్రస్తుతం అది రూ.90.28లకు ఎగబాకిందని, రూపాయి విలువ ఎందుకు పడిపోయిందో... ఆర్థిక వ్యవస్థ ఎలా అద్భుతంగా ఉందో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీకి ముందు దేశ అప్పు రూ.53 లక్షల కోట్లు ఉండగా... ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2.75 లక్షల కోట్లకు చేరిందని ముప్పాళ్ళ విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. సుపరిపాలన సీపీఐ, ఇతర వామపక్షాలు, లౌకికవాద పార్టీలతో మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గించారంటూ రాష్ట్రంలో సంబరాలు చేశారని, ఇటువంటి బ్రతుకుతెరువు రాజకీయాలకు స్వస్తి పలకాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు హితవుపలికారు. ప్రశ్నించే ఉద్యమకారులు, విద్యార్థి, యువజనులపై అడ్డగోలు కేసులు పెడితే సహించేది లేదన్నారు. రౌడీషీట్‌ను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారన్నారు. వై నాట్ 175 అన్న గత ప్రభుత్వాన్ని చూసైనా గుణపాఠం నేర్చుకోవాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయలేదన్నారు. ఎన్నికల హామీల అమలులో ఘోర వైఫల్యం చెందిందన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించలేదని, విద్యుత్ చార్జీలు తగ్గించలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అదానీ ప్రభుత్వంగా మారిపోయిందని విమర్శించారు. అత్యంత కీలకమైన విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు కట్టబెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం వైద్య కళాశాలల్లో సీట్లు అమ్ముకుంటే... ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో ఏకంగా కళాశాలలను అమ్ముకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి... మోదీ సర్కారు దేశద్రోహానికి పాల్పడితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ వంతపాడటం దుర్మార్గమన్నారు.

గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ జనగణనలో కులగణన చేపట్టాలని, మెడికల్ కళాశాలలకు సంబంధించి పీపీపీ విధానం రద్దు తదితర డిమాండ్లపై నూతన సంవత్సరంలో జరిగే పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, కార్యదర్శి షేక్ వలి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు సులభతరం

వ్యవసాయ సంచాలకులు డా. మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రైతులు తమ పంట వివరాలను స్వయంగా, సులభంగా నమోదు చేసుకునేలా ఈ-పంట యాప్‌ను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. మంగళగిరి వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో జాతీయ ఇన్‌ఫ్మాటిక్స్ సెంటర్, ఏపీ ఎయిమ్స్, డిజిటల్ వ్యవసాయ సెల్ ఉన్నతాధికారులతో సుదీర్ఘ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ-పంట నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, యాప్‌ను మరింత సులభతరం చేయడానికి, సరళీకరించిన నూతన ఆవిష్కరణ జరగాలని, వాటిపై మరింత కసరత్తు చేయాలని ఈ యాప్ అభివృద్ధి చేసిన నిక్ అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. రైతులు తమ చేను భౌగోళిక హద్దుల పరిధిలో పూర్తి స్వేచ్ఛతో పంట వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఈ రబీ సీజన్ నుంచే అమలు చేయాలని ఆయన ఆదేశించారు. డిజిటల్ వ్యవసాయ సెల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ యాప్‌తో క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బందికి కూడా ఈ-పంట నమోదు మరింత సులభతరం కానుందని తెలిపారు. రైతులు తమ పంట నమోదు ప్రతి దశలోనూ పరిశీలన, పర్యవేక్షణ చేసుకునే వెసులుబాటు ఉండటంతో పాటు తప్పులు ఉంటే వాటిని సవరించుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగులపై వేధింపులు తగవు

చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యాప్ పేరుతో సచివాలయ ఉద్యోగులను వేధించడం సరికాదని, వాట్సాప్ గవర్నెన్స్ ఫెయిలైతే ఆ నెపం సచివాలయాల ఉద్యోగులపై నెట్టడం తగదని వైసీపీ ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మనమిత్ర యాప్ పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ సేవలను 68 శాతం మంది ప్రజలు ఉపయోగించడం లేదని ప్రభుత్వ సర్వేలో వెల్లడయిందన్నారు. గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థే బాగుందని ప్రజలు ఇప్పటికీ అభిప్రాయపడుతున్నారని, ఇంటి గడప వద్దే అన్ని ప్రభుత్వ సేవలందించిన వలంటీర్లను తొలగించి, ఆ స్థానంలో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రజలపై బలవంతంగా రుద్దాలని కూటమి ప్రభుత్వం చూసిందని మండిపడ్డారు. అనేక కారణాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మనమిత్ర యాప్‌ను ఉపయోగించకపోవడంతో వాట్సాప్ గవర్నెన్స్‌లో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. ప్రజల ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా యాప్ రూపొందించకుండా వాట్సాప్ గవర్నెన్స్ ఫెయిలైందన్న కోపాన్ని సచివాలయ ఉద్యోగులపై చూపడం సరికాదని చెప్పారు. దాదాపు 27,280 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి వివరణ కోరే నెపంతో ఇబ్బంది పెట్టడం హేయమని పేర్కొంటూ, ప్రభుత్వం తన వైఫల్యాలకు సచివాలయ ఉద్యోగులను బాధ్యులను చేయడాన్ని ఆయన తప్పుపట్టారు.

నిరుద్యోగ భృతి... జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కూటమి గత ఎన్నికల సందర్భంగా నిరుద్యోగ యువతకు భారీ స్థాయిలో ఉద్యోగాలు హామీ ఇచ్చిందని, తీరా అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం మోసానికి పూనుకోవడం ఎంతవరకు సమంజసమని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.సంతోష్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం అనంతపురం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వైఎస్ కావలి కోటేష్‌తో కలిసి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు భారీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టోలో స్పష్టంగా పేర్కొన్నట్లుగా నెలకు మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి అందిస్తామని, ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో లక్షల మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా ప్రభుత్వం మాత్రం తన పార్టీ నాయకులకు లాభదాయక పదవుల పంచాయితీలలో నిమగ్నమైందని మండిపడ్డారు. యువజన, విద్యార్థి నాయకులు ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు నమోదు చేయడం, పాత కేసులను తవ్వి వేధించడం, కఠిన చట్టాలను ప్రయోగించి భయపెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని హెచ్చరించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం నిరుద్యోగ భృతిని అయినా అందించకపోవడం వల్ల యువత తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చదువులు పూర్తి చేసి అర్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగాలు రాక కుటుంబాలకు భారంగా మారుతున్నారని అన్నారు. నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలని, జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వీటిని నెరవేర్చని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, పోరాటాలు మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జనవరి 30 న నిరుద్యోగ సమస్యల పరిష్కారంపై చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తామన్నారు. అదేవిధంగా జనవరి 5న కర్నూలు నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిరుద్యోగుల సమస్యలపై ప్రత్యేక యంగ్ కమ్యూనిస్టుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత, హాజరై సమస్యలు, పరిష్కార మార్గాలను చర్చించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు నిరుద్యోగుల హక్కుల సాధనకు దోహదం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, నగర నాయకులు సురేంద్ర బాబు, ఉదయ్, బండారు తేజ, నంద, రియాజ్ పాల్గొన్నారు.

విక్రుతమాల ప్రభుత్వ గృహ సముదాయంలో ముళ్లపొదల తొలగింపు

పరిశీలించిన సీపీఐ నేత నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గృహాల సముదాయాన్ని సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ బుధవారం సందర్శించారు. లబ్ధిదారులతో సమావేశమై... అధికారులు చేపట్టిన ముళ్లపొదల తొలగింపు పనులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుతో, పంచాయతీ అధికారులతో కాలనీ సమస్యలపై చర్చించారు. జనవరి మొదటి వారంలో ప్రణాళికబద్ధంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ గృహాలు అభివృద్ధి చేసి... మౌలిక సదుపాయాలు కల్పించాలని నారాయణ కోరారు. కాలనీవాసులు శ్మశానం, పిల్లలకు ఆటస్థలం, తిరుపతికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, వీధి దీపాలు, ఆరోగ్య కేంద్రం కావాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నారాయణ వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, రేణిగుంట మండల కార్యదర్శి వైయస్ మణి, ప్రభుత్వ గృహాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివకుమార్, గోవర్ధన్, సత్యనారాయణ, శ్రీనివాసులు రెడ్డి, పుష్పరాజు, నారాయణ, వరప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో అసాధారణ రీతిలో సహజ ప్రసవం

4.8 కేజీల శిశువు జననం

4 గంటల పాటు శ్రమించిన అనకాపల్లి వైద్యులు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: అనకాపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రి అసాధారణ, అరుదైన ఘటనకు వేదికగా నిలిచింది. ఈ ఆసుపత్రిలో సూపర్ స్పెషాల్టీ సదుపాయాలు లేకున్నా వైద్యులు శ్రమతో కూడుకున్న ప్రసవాన్ని కూడా సహజంగా జరిపారు. దీంతో పండంటి మగ బిడ్డకు తల్లి జన్మనిచ్చింది. శిశువు బరువు 4.8 కేజీలు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఈమెకు ఇది రెండో కాన్పు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది చొరవను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలని సూచించారు. వివరాల్లోకి వెళితే... పెందుర్తి ప్రాంతానికి చెందిన కె.రూపవతి (25) కి 9 నెలలు నిండటంతో నొప్పులతో మంగళవారం అర్ధరాత్రి జిల్లా ఆసుపత్రిలో చేరింది. ఈమెకు 8 వ నెలలో నిర్వహించిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా శిశువు బరువు 3 కేజీలుగా ఉన్నట్లు వైద్యులు భావించారు. 9 నెలలు నిండిన అనంతరం శిశువు బరువు మరింత పెరిగినందున సిజేరియన్ లేదా సహజ ప్రసవం చేసేందుకు వైద్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. రూపవతికి ఇదే ఆసుపత్రిలో తొలి ప్రసవం సహజ విధానంలో జరిగింది. అయితే ఇప్పుడు రెండవ కాన్పులో శిశువు బరువుగా ఉన్నందున తల ముందుకు వచ్చినట్లు భుజాలు బయటకు వచ్చేందుకు సాధ్యపడలేదు. సిజేరియన్ తప్పదేమోనని అనుకున్నారు. కానీ 'వుడ్స్ కార్క్ స్క్రూ ' (మ్యాన్ అవర్) విధానంలోని మెళకువలను పాటించి, భుజాలు బయటకు వచ్చేలా వైద్యులు చేశారు. దీనివల్ల సిజేరియన్‌కు బదులు సహజ ప్రసవం జరిగింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. సెకండరీ ఆసుపత్రుల్లో ఇలాంటివి జరగడం చాలా అరుదు అని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు. సుమారు 4 గంటల పాటు వైద్యులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ మానస (పీజీ థర్డ్ ఇయర్ స్టూడెంట్), స్టాఫ్ నర్సులు జగదీశ్వరి, జె.కుమారి, ఏఎన్ఎం సరస్వతి శ్రమించారని తెలిపారు.

ముప్పు అధికంగా ఉన్నా...

ఒక్కోసారి బరువు అధికంగా ఉన్న శిశువులకు ఊపిరి తీసుకోవడం కష్టం కావొచ్చు. అలాగే తల్లికి బ్లీడింగ్ సమస్య ఎక్కువవుతుంది. ఇవికాకుండా పెర్నియల్ టియర్ (యోని చీలిక) వంటి తలెత్తే ఇతర సమస్యలను కూడా దృష్టిలో పెట్టుకుని వైద్యులు తీసుకున్న జాగ్రత్తల వల్ల సహజ ప్రసవం సాధ్యమైంది. సాధారణంగా ఇలాంటి పద్ధతులు బోధనాసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జరుగుతుంటాయి. వీటికి భిన్నంగా అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో అసాధారణ రీతిలో సహజ ప్రసవం జరగడం విశేషం. అధిక బరువు కలిగిన శిశువులను మాక్రోసోమియా కేసుగా పరిగణిస్తారు. ప్రసవ సమయంలో తల్లికి, బిడ్డకు ముప్పు ఎదురయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా వైద్యులు 4 కేజీలు లేదా 4.5 కేజీలు అంతకంటే ఎక్కువ బరువు కలిగిన శిశువులకు సిజేరియన్ సెక్షన్ సూచించే అవకాశాలు ఎక్కువ. కానీ వైద్యులు చూపిన చొరవతో సహజ ప్రసవం జరిగినందున తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

సహజ ప్రసవాలు పెరగాలి : ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

నూతన సంవత్సరంలోనూ ఇటువంటి చొరవ ప్రభుత్వాసుపత్రుల్లో కొనసాగాలన్న ఆకాంక్షను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సత్యకుమార్ యాదవ్ వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో నెలకు 400 వరకు ప్రసవాలు జరుగుతుంటే అందులో 65 శాతం నుంచి 70 శాతం వరకు సహజ ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు.

సీపీఐ నేత కూరంగి మృతి

రాష్ట్ర నాయకుల విప్లవజోహార్లు

విశాలాంధ్ర-సీతమ్మపేట/పార్వతీపురం : సీపీఐ నాయకుడు, ఉద్యమకారుడు, గిరిజనుల పక్షపాతి కూరంగి ముఖలింగం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కూరంగి ముఖలింగం పార్వతీపురం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో కిల్లాడ పంచాయతీ గాడిదపాయి గ్రామానికి చెందిన వారు. గిరిజన ప్రాంతాలలో భూ పోరాటాలు, ఉద్యమాలు చేశారు. పేదలకు అండగా నిలిచారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో ముగిశాయి. సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యతో పాటు ప్రముఖ నాయకులు జల్లి విల్సన్, జీవీ సత్యనారాయణమూర్తి, పి.కామేశ్వరరావు సహా స్థానిక నాయకులు కె.మన్మథరావు, చాపర సుందర్ లాల్, తాపర వెంకటరమణ, సనపల నరసింహులు, విశాలాంధ్ర మేనేజర్ సంతాపం ప్రకటించారు. కూరంగి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాగా, కూరంగి ముఖలింగం యుక్త వయస్సులోనే ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశారు. కేసుల్లో చిక్కుకున్నారు. ఎనిమిదేళ్లు రాజమండ్రి, విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్నారు. పోలీసుల వేధింపుల నేపథ్యంలో అడవి బాట పట్టిన ఆయన సీపీఐ గూటికి చేరారు. నాటి సీపీఐ నాయకులు దాసరి నాగభూషణ్, గిరిప్రసాద్ సమక్షంలో ఎర్ర జెండా పట్టారు. భూ పోరాటాలు, ఉద్యమాలు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగానూ పనిచేశారు. శ్రీకాకుళం జిల్లాలో సేవలందించారు. 2006లో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. నాడు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ కె.నారాయణతో కలిసి కడగండి పంచాయతీ నారాయణగూడ, లోకొత్తవలస గిరిజన గ్రామాల్లో భూ సమస్యలపై కూరంగి పోరాడారు. కూరంగి ముఖలింగానికి ఇద్దరు భార్యలు... ఎనిమిది మంది సంతానం. పెద్ద భార్య సుబ్బమ్మ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. చిన్న భార్య మంగమ్మ ఉన్నారు. కూరంగి శేషజీవితం పంటలు పండించుకుంటూస్తూ ప్రశాంతంగా గడుస్తుందని అనుకున్నారు కానీ ఆయన అనారోగ్యానికి గురై మరణించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

నెరవేరిన కల

అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లి అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఆవిర్భావమైన శుభసందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే యం.షాజహాన్ భాషా అధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ అంబరాన్నంటింది. పుంగనూరు రోడ్డులో మిషన్ కాంపౌండ్ నుంచి మొదలైన ర్యాలీలో మదనపల్లె నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు, విద్యార్థులు, మహిళలు, యువత పాలుపంచుకున్నారు. దశాబ్దాల కలగా మిగిలిన మదనపల్లి ప్రజల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తూ అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లెను ఏర్పాటు చేయడంపై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మిషన్ కాంపౌండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం మీదుగా వాల్మీకి సర్కిల్,టౌన్ బ్యాంక్ సర్కిల్,అవెన్యూ రోడ్డు, బెంగళూరు బస్టాండు, అనిబిసెంట్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా అనిబిసెంటుకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ విజయోత్సవానికి ముఖ్య అతిథిగా పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాషా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తోందన్నారు. దశాబ్దాలుగా ఉన్న మదనపల్లె జిల్లా కలను నెరవేర్చడమే ఇందుకు నిదర్శనమన్నారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయమన్నారు. మదనపల్లి, తంబళ్లపల్లి , పీలేరు, పుంగనూరు నియోజకవర్గ వర్గాల ప్రజలకు ఒక పండుగ రోజన్నారు. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ మదనపల్లి జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పఠాన్ ఖాదర్ ఖాన్, ఒకటి, రెండు డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి, మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం రాయల్, ఆర్.జె.వెంకటేష్, నవీన్ చౌదరి, జంగాల వెంకటరమణ, రెడ్డి షంషీర్, రామిశెట్టి కృష్ణ, దారం అనిత, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, మోడెం సిద్ధప్ప, రాటకొండ శ్రీనివాస నాయుడు, కొరముట్ల నాగరాజు, కంచర్ల చింటూ, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు తలారి రాధమ్మ, బీదం గురునాథ్ యాదవ్, జీవీ నాయుడు, మండిపల్లి మధుసూదన్ రెడ్డి, జేసీబీ వేణు, బాలమాలి శేఖర్, రెడ్డి రాయల్, మంజునాథ్, నరేంద్రబాబు,పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సున్నా కర్బన ఉద్గారాల దిశగా ఏపీ విద్యుత్ రంగం

సీఎస్ విజయానంద్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని నెట్ జీరో కార్బన్ ఉద్గారాల దిశగా నడిపిస్తూ, స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను సాకారం చేసే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ రంగం గణనీయమైన మార్పుల బాట పట్టిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. విజయవాడ విద్యుత్ సౌధలో జరిగిన ఏపీ పవర్ యుటిలిటీల న్యూ ఇయర్-2026 డైరీలు, క్యాలెండర్ల సంయుక్త ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం నష్టాల నియంత్రణ, సాంకేతిక స్వీకరణలో దేశంలో ముందంజలో ఉందని సీఎస్ తెలిపారు. డిస్కమ్ నష్టాలు సుమారు 9.6 శాతానికి పరిమితమయ్యాయని, ఏపీ ట్రాన్స్‌కో నష్టాలు 2.6 శాతం వద్ద కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యుత్ లభ్యత 99.9 శాతం మించిందని పేర్కొన్నారు. ఏపీ జెన్‌కో ప్లాంట్ల పని తీరు గణనీయంగా మెరుగై, గ్రిడ్ అవసరాలకు అనుగుణంగా 85 శాతానికి పైగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను నిలుపుకోగల స్థాయికి చేరిందన్నారు. విద్యుత్ వ్యయ నియంత్రణలోనూ రాష్ట్రం కీలక ముందడుగు వేసిందని విజయానంద్ తెలిపారు. గత ఏడాది యూనిట్‌కు రూ.5.19 గా ఉన్న సగటు విద్యుత్ కొనుగోలు ఖర్చు ప్రస్తుతం రూ.4.90కి తగ్గిందని వెల్లడించారు. దీని ఫలితంగా నవంబరు నుంచి వినియోగదారులకు యూనిట్‌కు 13 పైసల బిల్లు తగ్గింపు అందుతోందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు రూ.4.60కి, 2029 నాటికి రూ.4 కంటే తక్కువకు వ్యయాన్ని తగ్గించడమే లక్ష్యమని తెలిపారు. అన్ని విద్యుత్ సంస్థలు ఒకే వేదికపై డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించడం ఐక్యత, సమన్వయానికి ప్రతీకగా నిలుస్తోందని సీఎస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఎ.పి.పోలీస్ శాఖ
సవరణ
సవరణ జారీచేయబడిన Tender Notice No.EAGLE/AV&VC/2025-26/17
ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలో గల ఎలైట్ యాంటీ నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్)కు ఆడియో, వీడియో (ఎవి) మరియు వీడియో కాన్ఫరెన్స్ (విసి) వ్యవస్థ ఏర్పాటు కోసం పిలిచిన టెండర్ లింకుకు ఐడి నెం: 878128. టీ.ఎస్.నెంబరు ఈగల్/ఏవి&విసి/2025-26/17కు సవరణ జారీచేయబడినది. మరిన్ని వివరాలు వెబ్‌సైట్‌లో https://tender.apeprocurement.gov.in లో అందుబాటులో ఉండే సమయం : ది.29-12-2025 నుండి 02-01-2026 సాయంత్రం 5 గంటల నుండి చూడగలరు. ఫోన్ నెం. 8686068888.
సం/- ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఈగల్, ఎ.పి., మంగళగిరి
DIPR/18619/CL/ADVT-1/1/2021-22 Dt. 31-12-2025

సంపాదకీయం

సంఘ్ పరువు తీసిన న్యూయార్క్ టైమ్స్

అమెరికా నుంచి వెలువడే న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంఘ్ పరివార్ గుట్టు రట్టు చేసింది. అంటే ఒక రకంగా ప్రధానమంత్రి మోదీ అసలు స్వరూపాన్ని కూడా బయట పెట్టింది. గత పది రోజుల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలలో విద్వేషం విషం కక్కుతోంది. బరేలీలో ఒక నర్సింగ్ విద్యార్థిని తన పుట్టిన రోజు పండగకు తన మిత్రులను ఆహ్వానించింది. బజ్‌రంగ్ దళ్ కార్యకర్తలమని చెప్పుకునే వారు జన్మదిన వేడుకలు జరుగుతున్న చోటికి వెళ్లి ఆ అమ్మాయి స్నేహితులలో ఇద్దరు ముస్లింలు ఉండడాన్ని గమనించి వారిని చితక బాదారు. విచిత్రం ఏమిటంటే మొదట బాధితుల మీదే కేసు నమోదు చేశారు. ఆ తరవాత దాడి చేసిన వారిని కూడా అరెస్టు చేశారు. ఈ మూకకు నాయకత్వం వహిస్తున్న రిషభ్ ఠాకూర్ ఇంకా పోలీసులకు పట్టుబడలేదు. ఈ మొత్తం దారుణాన్ని వీడియో తీసి ప్రచారంలో పెట్టారు. అదేమంటే మేం మా వారిని కాపాడడానికి వెళ్లామని ఆకతాయి మూక అంటోంది. సంఘ్ పరివార్‌కు అనుబంధంగా ఉన్న మూకలకు స్వపర భేదాలు కూడా ఉన్నట్టు లేవు. వారణాసిలో గంగా నదిలో స్నానం చేస్తున్న భారత్ యాత్రకు వచ్చిన ఓ కుర్రాడిని ఈ మూకలు నానా యాతన పెట్టాయి. ఆ కుర్రాడు చేసిన పాపమల్లా తల మీద ఎర్రటి శాంతా క్లాజ్ టోపీ పెట్టుకోవడం. ఎర్రటి చెడ్డీ వేసుకోవడం. హిందూ తత్వం కరడుకట్టిన అనేక మంది పరుగు పరుగున అక్కడికి వచ్చి ఆ కుర్రాడిని చాలా ఇబ్బంది పెట్టారు. ఈ సంఘటన వారణాసిలోని ప్రధాన స్నానఘట్టం దగ్గర జరిగింది. గంగా హారతి చూడడానికి ప్రతి రోజు వేలాది మంది వస్తూ ఉంటారు. సరిగ్గా ఇదే స్నానఘట్టం దగ్గర జపాన్ ప్రధానమంత్రి మన దేశానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ ఆయనను ఊయలలూగించారు. జపాన్ ప్రధాని గంగా హారతిలో కూడా పాల్గొన్నారు. సరిగ్గా ఆ దేశానికి చెందిన యువకుడే సంఘ్ పరివార్ అల్లరి మూకల బారిన పడవలసి వచ్చింది. త్రిపురకు చెందిన అంజెల్ చక్మాను చైనీయుడిగా భావించి సంఘ్ పరివార్ మూకలు చితక బాదాయి. తీవ్రంగా గాయపడ్డ ఆ వ్యక్తి పది పన్నెండు రోజుల తరవాత ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఉత్తరాఖండ్‌లో జరిగింది. క్రిస్మస్ సందర్భంగా దేశంలో వివిధ ప్రాంతాలలో క్రిస్మస్ వేడుకల మీద దాడి చేశారు. శాంతాక్లాజ్ బొమ్మల మీద ఆ వేషం వేసుకున్న వారి మీద సంఘ్ మూకలు తీవ్రంగా దాడి చేసి కనీవినీ ఎరుగని విధ్వంసం సృష్టించాయి. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ప్రసిద్ధ మాల్‌లోకి చొరబడి క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న వారి మీద భీకరమైన దాడి చేశారు. ఇలాంటి ఘోరాలు 2025 వ సంవత్సరం చివరి పది రోజులలో పెట్రేగి పోయాయి. ఐ.పి.ఎల్. మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో పాల్గొనే బృందాలలో షారుఖ్‌ఖాన్ అధీనంలోని బృందం కూడా ఉంది. ఆ బృందంలో ఒక బంగ్లాదేశీ క్రీడాకారుడు కూడా ఉన్నారు. ఆ క్రీడాకారుడు ఉంటే మ్యాచ్ జరగనివ్వబోమని సంఘ్ మూకలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. ఆ బంగ్లా క్రికెటర్ మీదే కాక షారుఖ్‌ఖాన్ మీద దాడి చేస్తామని బాహాటంగా హెచ్చరిస్తున్నారు. సంఘ్ పరివార్ దురహంకారానికి సంబంధించిన ఇలాంటి ఘోరాల జాబితా చాలా పొడవైందే. మొత్తం మీద 2025 వ సంవత్సరం హిందూత్వ మూకల విలయ నర్తనంతో ముగిసింది.

ఇలాంటి అఘాయిత్యాలు కొత్తేమీ కాదు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత మతోన్మత్తుల మూకలు కొట్టి చంపడం అనే కిరాతకమైన కొత్త ప్రక్రియ ప్రారంభించారు. దీనినే లించింగ్ అంటారు. అంతకుముందు ఈ లించింగ్ అన్నమాట మన దేశంలో ఎన్నడూ వినిపించలేదు. ఈ దారుణకాండకు బలైన వారికి లెక్కే లేదు. ఈ మూక దాడులు గోరక్షణ పేరిట మొదలయ్యాయి. ఇటీవలే వారణాసిలో పశువులను దొంగిలిస్తున్న వారిని అరెస్టు చేశారట. వారు దొంగిలించి తీసుకెళ్తున్న నాలుగు ఆవులను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఆవులను దొంగిలించిన వారు గోహత్యకు పాల్పడేవారు కాదు. సాధారణంగా గోహత్యకు పాల్పడుతున్నారన్న ఆరోపణపై ముస్లింలను కొట్టి చంపిన సంఘటనలు అనేకం జరిగాయి కానీ గోవులను తరలిస్తూ పట్టుబడ్డవారు రాజు పాండే, తీరథ్ కుమార్ సింగ్. వీరు పేర్లను బట్టి వీరు హిందువులే అని చెప్పడానికి అంతగా కష్టపడనక్కర్లేదు. పద్మావతి సినిమా తీసిన సంజయ్‌లీలా బన్సాలీ చరిత్రను వక్రీకరిస్తున్నారని హిందూత్వ భావజాలం ఉన్న వారే చెంపదెబ్బలు కొట్టారు. దీన్నిబట్టి ఈ మూకల దాడి కేవలం ముస్లింల మీదో, క్రైస్తవుల మీదో పరిమితం కాదు. తాము నమ్మే సిద్ధాంతానికి వ్యతిరేకులని భావిస్తే ఎవరి మీదైనా దాడి చేయగలరు. ఈ సంఘటనల ప్రభావం మన సరిహద్దులు దాటి కనిపించదనుకోవడం భ్రమ. అందుకే న్యూయార్క్ టైమ్స్ సంఘ్ పరివార్ గుట్టు విప్పింది. విస్తారమైన వార్త ప్రచురించింది. అందులో చెప్పిన కొత్త విషయాలేమీ లేకపోవచ్చు. కానీ ఆర్.ఎస్.ఎస్. బయటికి కనిపించేది కాదని తేల్చి చెప్పింది. అసలు ఆర్.ఎస్.ఎస్. భావజాలం, వారు శాఖల్లో ధరించే దుస్తులు, వారి భావజాలం జర్మనీలో బీభత్సం సృష్టించిన హిట్లర్ నుంచి, ఇటలీ నియంత ముస్సోలిని నుంచి తీసుకున్నవేనని న్యూయార్క్ టైమ్స్ పత్రిక మరోసారి వెల్లడించింది. ఆర్.ఎస్.ఎస్. దగ్గర అపారమైన నిధులున్నాయని కూడా రాసింది. విదేశాల్లో తన కీర్తి ప్రజ్వరిల్లుతోందని మోదీ చేసుకుంటున్న ప్రచారంలోని డొల్లతనం మరోసారి బట్టబయలైంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనకు మంచి మిత్రుడు అని మోదీ మొన్నటి దాకా టముకు వేసుకునే వారు. కనీసం ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించనైనా లేదు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఏ పాటిదో అంతర్జాతీయ సమాజం గ్రహిస్తూనే ఉంది. ఆలింగనాలు, కరచాలనాలు విదేశాంగ విధానానికి ప్రతీకలు కావని అడుగడుగునా రుజువు అవుతోంది. శుష్క వాగ్దానాలు, అసత్య ప్రచారాల ద్వారా, సబ్కాసాథ్, సబ్కావికాస్ నినాదాల ద్వారా ఎల్లకాలం మోసం చేయడం కుదరదని న్యూయార్క్ టైమ్స్ కథనం రుజువు చేసింది. ప్రచారాస్త్రాలతో నిజం ఎల్లకాలం దాచడం కుదరదు. చిక్కేమిటంటే ఈ అవమానం మోదీకి, సంఘ్ పరివార్‌కు పరిమితం కాదు. ఈ అవమానం దేశాన్నే రచ్చకీడ్చింది.

ప్రజా భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం!

టి.ఎం.బి. బుచ్చిరాజు

గ్రామాల అభివృద్ధి లేకుండా రాష్ట్రాభివృద్ధి అసంపూర్ణమే అన్న సత్యాన్ని భారత రాజ్యాంగం గుర్తించింది. మహాత్మాగాంధీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్య భావన కూడా అదే ప్రతిబింబిస్తుంది. ఈ దృక్పథానికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలి కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామ పాలనకు కొత్త ఊపిరిని ఇస్తున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బాధ్యతలు స్వీకరించిన తరువాత, ఈ శాఖలో కనిపిస్తున్న చురుకుదనం ప్రస్తావించదగినది.

పదివేల పదోన్నతులు-మానవ వనరుల బలోపేతం: పంచాయతీరాజ్ సంస్థలలో 10,000 పదోన్నతులు జారీ కావడం శాఖ చరిత్రలో ఒక మైలురాయి. దశాబ్దాలుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల ఆకాంక్షలకు ఇది సార్థకమైన సమాధానం. ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. వ్యవస్థపై నమ్మకం మరింత బలపడింది. పరిపాలనలో మానవ వనరులే ప్రధాన శక్తి అన్న సత్యాన్ని ఈ నిర్ణయం మరోసారి రుజువు చేసింది.

గ్రామీణాభివృద్ధికి భారీ బడ్జెట్ కేటాయింపు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్ శాఖకు రూ.4393.89 కోట్ల బడ్జెట్ డిమాండ్‌ను ఉప ముఖ్యమంత్రి శాసనసభలో ప్రవేశపెట్టారు. ఇది గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న అత్యున్నత ప్రాధాన్యతకు స్పష్టమైన నిదర్శనం. ఈ నిధులు గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల మూడు అంచెల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉన్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు: 15 వ ఆర్థిక సంఘం పరిధిలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లకు రూ.2,099 కోట్లు కేటాయించటం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా మారనుంది. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి అవసరాలపై ఈ నిధులు గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి.

పల్లె వెలుగు పథకం: గ్రామాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణ కోసం 'పల్లె వెలుగు' పథకానికి రూ.250 కోట్లు కేటాయించడం మరో కీలక అడుగు. దీని ద్వారా గ్రామ భద్రత పెరుగుతుంది, విద్యుత్ వినియోగంలో పొదుపు సాధ్యమవుతుంది, రాత్రి వేళల్లో గ్రామ జీవనం మరింత చైతన్యవంతమవుతుంది.

సామాజిక సమానత్వం: గ్రామీణాభివృద్ధి అంటే కేవలం భౌతిక మౌలిక సదుపాయాలే కాదు. సామాజిక సమానత్వం కూడా అంతే ముఖ్యం. ఎస్సీ కాలనీల్లో గ్రంథాలయాల ఏర్పాటు కోసం నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం విద్య, జ్ఞానాభివృద్ధికి పెద్దపీట వేసింది. ఇది గ్రామీణ యువతలో చదువుపై ఆసక్తిని పెంచి, దీర్ఘకాలిక సామాజిక మార్పునకు దోహదపడుతుంది.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) కు రూ.1 కోటి కేటాయించడం స్థానిక స్వయం పాలనకు నిజమైన అర్థాన్ని ఇస్తుంది. ప్రతి గ్రామం తన అవసరాలను తానే గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఈ విధానం కల్పిస్తుంది. ఇక రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద శిక్షణ, సామర్థ్యాభివృద్ధికి రూ.130 కోట్లు కేటాయించడం పంచాయతీరాజ్ ప్రతినిధులు, సిబ్బందిపై పెట్టుబడిగా భావించాలి. అలాగే డ్రోన్ సాంకేతికతతో ఆస్తుల సర్వే, హక్కుల నమోదు చేసే స్వమిత్వ పథకం గ్రామాల్లో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా మారే అవకాశం ఉంది.

చట్టసవరణ అవసరం: ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడు స్థాయిల స్థానిక సంస్థలు స్వతంత్రంగా ఉన్నప్పటికీ, పరిపాలనా పర్యవేక్షణలో స్పష్టత లోపించింది. గ్రామ పంచాయతీలపై మండల ప్రజాపరిషత్‌కు, మండల ప్రజాపరిషత్‌లపై జిల్లా ప్రజాపరిషత్‌కు పర్యవేక్షణ అధికారాలు లేకపోవడం వల్ల అభివృద్ధి పనుల అమలు, నిధుల వినియోగంలో గందరగోళం నెలకొంది. కాబట్టి మూడు స్థాయిల మధ్య స్పష్టమైన పరిపాలనా అనుసంధానం చేసినప్పుడే డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల నియామకాలకు సార్థకత వస్తుంది. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ విధానం ఏర్పడుతుంది. అంతేకాక తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం (2018) తరహాలో ట్రైబ్యునల్ ఏర్పాటు అత్యవసరంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా పంచాయతీరాజ్ సంస్థలలో, ముఖ్యంగా గ్రామ పంచాయతీలలో నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు.

అధికారాల వికేంద్రీకరణ: 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాలు నిధులు, విధులు బదలాయింపు జరగాలి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 29 అంశాలకు సంబంధించిన నిధులు, విధులు, అధికారాలు బదలాయింపులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం పది అంశాలకు సంబంధించిన బదలాయింపు జరిగిందని చెప్తున్నారు. కానీ వాస్తవ రూపంగా అవి జరిగినట్టుగా కనిపించట్లేదు. అందుకే పరిపాలనా ఏకీకృతం జరగాలి. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి విభాగాల పరిపాలన, ఖాతాల వ్యవస్థలను కమిషనర్ కార్యాలయం, జిల్లా పరిషత్, డివిజనల్ డెవలప్‌మెంట్, మండల పరిషత్ కార్యాలయాలలో ఏకీకృతం చేయాలి. "గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది" అన్న పవన్ కళ్యాణ్ మాటలు నినాదాలుగా కాకుండా విధానాలుగా అమలవుతున్నాయని చెపుతున్నారు. అంతేగాక అదనంగా గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్ విభాగాల నుంచి కూడా వేల కోట్ల రూపాయలు గ్రామీణ భారత్ వికాసానికి ఖర్చు పెడుతున్నారు. ఈ దిశలో చట్ట సవరణలు, పరిపాలనా సమన్వయం, ప్రజల భాగస్వామ్యం కొనసాగితే, గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ రూపం దాల్చడం ఖాయం.

చైర్మన్,ఏ.పీ. పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్
మొబైల్: 9703425006

కేరళలో అమిత్‌షాకు భంగపాటు!

ఎం.కోటేశ్వరరావు

ఇటీవల కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అక్కడ అధికారంలో ఉన్న వామపక్ష సంఘటనకు ఎదురుదెబ్బ తగిలిందన్నది వాస్తవం. దాన్ని చావుదెబ్బగా కొందరు వర్ణిస్తున్నారు. అది నిజమా ? ప్రధాని నరేంద్రమోదీ తిరువనంతపురంలో బీజేపీ సాధించిన విజయం గురించి గొప్పలు చెప్పుకున్నారు. కేరళ రాజకీయాల్లో ఒక మహత్తర ఘట్టం అన్నారు. మోదీ సేవలో తరిస్తున్న కాంగ్రెస్ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ చారిత్రాత్మక విజయం అన్నారు. ఎందుకటా నాలుగున్నర దశాబ్దాలుగా తిరువనంతపురం మేయర్ పీఠాన్ని నిలుపుకున్న సీపీఎం అక్కడ ఓడిపోయి 101 సీట్లకు బీజేపీ 50 తెచ్చుకున్నందుకు. ఓకే, కాసేపు నరేంద్రమోదీని సంతుష్టీకరించేందుకు అంగీకరిద్దాం, నిజమే కదా ! అయోధ్య రామ మందిరం గురించి దశాబ్దాల పాటు బీజేపి ఎంత హడావుడి చేసిందో చూశాము. దానివల్లనే మూడుసార్లు మోదీ ప్రధాని అయ్యారు. అక్కడ మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో పదేండ్ల అధికారం తరువాత బీజేపి ఓడిపోయింది, అంతేనా, వారణాసి నియోజకవర్గం, వరుసగా ప్రధాని నరేంద్రమోదీ మూడుసార్లు ఎన్నికయ్యారు. తొలిసారి 3,71,784 ఓట్ల మెజారిటీ తెచ్చుకుంటే రెండవసారి 4,79,505 కు పెంచుకోగా మూడవ సారి 1,52,532 కు దిగజారింది. దీని గురించి ఏమని వర్ణిస్తారు ? ఒక వాస్తవం ఏమంటే కేరళలో గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఈసారి పెరగకపోగా స్వల్పంగా తగ్గాయి. దీని గురించి మోదీ నుంచి ఎలాంటి స్పందనా ఉండదు! స్థానిక సంస్థలలో అనేక అంశాలు పని చేస్తాయి. బీజేపీ కేరళలో గతంలో తెచ్చుకున్న ఆరువందలకు పైగా పంచాయతీ వార్డులను ఈసారి పోగొట్టుకుంది. కొత్తగా కొన్ని తెచ్చుకొని గతం కంటే స్వల్పంగా మెరుగుపడింది. ఒకసారి అధికారంలో ఉన్న తరువాత అన్ని పార్టీలకూ వాటి పని తీరును బట్టి వ్యతిరేకత ఉంటుంది. అది ఒక్క సీపీఐ(ఎం) కే కాదు, ప్రతి పార్టీకి వర్తిస్తుంది.

కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ (ఎం) నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ పని అయిపోయిందని తరువాత బీజేపీదే హవా అన్నట్లుగా మీడియాలో కొందరు ఊదరగొట్టారు. కేరళలో కమ్యూనిస్టు వ్యతిరేక మీడియాలో మళయాళ మనోరమ ఒకటి. అది 2025 డిసెంబరు 22 న ఒక విశ్లేషణ రాసింది. దానికి పెట్టిన శీర్షిక " స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ తీరుచూసి అమిత్ షా ఎందుకు ఆశాభంగం పొందుతారంటే" దాన్లో ఏముందో చూద్దాం. "స్థానిక సంస్థల ఎన్నికల్లో 25శాతం ఓట్లు తెచ్చుకోవాలని కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా లక్ష్య నిర్దేశం చేశారు. అమిత్‌షాలో ఆశావాద వేడి ఎందుకు పుట్టిందంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏ ఒక్కటే ఇక్కడ 19.40 శాతం ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. అదిప్పుడేమైందంటే నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (బీజేపీ -భారత ధర్మ జనసేన-లోక్ జనశక్తి పార్టీ) కేవలం 14.76 శాతం ఓట్లనే తెచ్చుకోగలిగింది. (గత స్థానిక ఎన్నికల కంటే 0.24 శాతం తక్కువ- వికీపీడియా) యుడిఎఫ్‌కు 38.81, ఎల్‌డిఎఫ్‌కు 33.45శాతం వచ్చాయి.

పంచాయత్‌లలో(జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయి తీలు అన్నీ కలిపి) ఎన్‌డిఏకు వచ్చిన ఓట్లు 13.92 శాతం, 2020 లో వచ్చిన 14.34 శాతం కంటే స్వల్పంగా తక్కువ. మున్సిపాలిటీలలో 13.1 నుంచి 19.44 శాతానికి పెంచుకుంది. కార్పొరేషన్లలో 19.44 నుంచి 23.58 శాతానికి పెంచుకుంది. మొత్తం అన్ని స్థానిక సంస్థలలో వచ్చిన సగటు ఓట్లు 14.76 శాతం. యుడీఎఫ్‌కు సీట్ల రీత్యా ఎల్‌డిఎఫ్ కంటే మెరుగ్గా వచ్చాయి, గతం కంటే నాలుగుశాతం ఓట్లు పెరిగినప్పటికీ ఎన్‌డిఏకు వచ్చిన 34.52 శాతం కంటే మెరుగ్గా ఎల్‌డిఎఫ్‌కు 34.56 శాతం వచ్చాయి.

2020 లో బీజేపీకి కాసరగోడ్ జిల్లాలోని మధుర్, బెల్లూర్ గ్రామ పంచాయితీలలో, రెండు మున్సిపాలిటీలు పాలక్కాడ్, పండలంలో స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈసారి రెండింటిలో దానికి మెజారిటీ రాలేదు, పండలంలో అవమానకరంగా నష్టపోయింది. ఈసారి ఎన్‌డిఏ 421 కార్పొరేషన్ వార్డులకు గాను 22.09 శాతం (93), 3,240 మున్సిపల్ వార్డులకు గాను పదిశాతం (324), 346 జిల్లా పంచాయత్ వార్డులకు గాను ఒక్కటి, 2,267 బ్లాక్ పంచాయత్ వార్డులకు 54, గ్రామ పంచాయితీలలోని 17,337 కు గాను 1,447 వార్డులు 8.35 శాతం వచ్చాయి. ఒక్క కార్పొరేషన్లలో తప్ప 2020 తో పోల్చితే బీజేపీ పరిస్థితి పెద్దగా మెరుగైనట్లు ఇవి ప్రతిబింబించటం లేదు. మున్సిపాలిటీలు, జిల్లా పంచాయత్‌లో గతం కంటే తగ్గింది. బీజేపీ 2020 లో సాధించినవి, ఇప్పటి పరిస్థితి ఇలా ఉంది. కార్పొరేషన్లు 14.25 (ఇప్పుడు 22.09), మున్సిపాలిటీలు 10.4 (ఇప్పుడు పదిశాతం) జిల్లా పంచాయత్‌లు 0.60 (ఇప్పుడు 0.29), బ్లాక్ పంచాయత్ 1.78 (ఇప్పుడు 2.38) గ్రామ పంచాయితీలు 7.4 (ఇప్పుడు 8.35). ఈ సారి పండలం మున్సిపాలిటీని బీజేపీ కోల్పోయింది. ఇది శబరిమలకు దగ్గరగా ఉంది. అంతర్గత కుమ్ములాటలు, పాలనలో అక్రమాల కారణంగా ఇది జరిగింది. గతంలో బీజేపీకి 20 సీట్లు ఉంటే ఇప్పుడు తొమ్మిది స్థానాలతో మూడవ స్థానానికి దిగజారింది. పాలక్కాడ్‌లో బీజేపీ 2020 లో 28 సీట్లు తెచ్చుకొని సంపూర్ణ మెజారిటీ సాధించింది. ఈసారి పెద్ద పార్టీగా ఎన్నికైనప్పటికీ మెజారిటీకి అవసరమైన 27 కు గాను 25 తెచ్చుకుంది. తిపురినిత్తుర మున్సిపాలిటీలో గత ఎన్నికల్లో 15 తెచ్చుకుంది.(ఎల్‌డిఎఫ్‌కు 21) ఈసారి 21 సీట్లతో బీజేపీ పెద్ద పార్టీగా ఎన్నికైంది, మెజారిటీ సంఖ్య 27. గత ఎన్నికల్లో రెండవ పార్టీగా ఉన్నప్పటికీ ఓట్ల శాతంలో 27.54 తో పెద్దదిగా, యుడిఎఫ్ 24.42, ఎల్‌డిఎఫ్ 23.25 శాతం తెచ్చుకున్నాయి.

మున్సిపాలిటీలలో గుర్తించదగినదిగా బీజేపీ ఉనికి ఉన్నప్పటికీ కొన్ని జిల్లాల్లో దాని ఓట్ల వాటా పెరిగింది. అయితే కొన్ని జిల్లాలోని మున్సిపాలిటీలలో దాని ఓట్ల వాటా తగ్గింది. ఇవన్నీ మళయాళ మనోరమ విశ్లేషణ లోని అంశాలే. తిరువనంతపురంలో బీజేపీ గెలుపు గురించి మీడియాలో వచ్చిందేమిటో చూశాము. శబరిమల అయ్యప్ప ఆలయం సమీపంలో ఉన్న పండలం మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా గత ఎన్నికల్లో బీజేపీ పద్దెనిమిది తెచ్చుకుంది. ఈసారి తొమ్మిది వార్డులతో మూడ స్థానానికి పడిపోయింది. అనేక మంది రాష్ట్ర నేతలు ఇక్కడ తిష్టవేసి ఎలాగైనా నిలబెట్టుకోవాలని చూశారు. ఎల్‌డిఎఫ్ 14, యుడిఎఫ్ 11 తెచ్చుకున్నాయి. అయ్యప్పస్వామి ఆలయ ప్రవేశ వివాదంతో గతంలో బీజేపీ పొందిన లబ్ది ఇప్పుడు తుడిచి పెట్టుకుపోయింది. ఇటీవల అయ్యప్ప ఆలయంలో జరిగిన బంగారు తాపడాల అక్రమాన్ని ప్రచారం చేసి మరింతగా లబ్దిపొందాలని చూసి భంగపడింది. ఈ మున్సిపాలిటీ మాత్రమే కాదు, దాని పక్కనే ఉన్న కులంద గ్రామ పంచాయితీ 15 సంవత్సరాలుగా బీజేపీ ఆధీనంలో ఉంది. ఈసారి అక్కడ ఎల్‌డిఎఫ్ 8, బీజేపీ, ఇతరులు నాలుగు చొప్పున, యుడిఎఫ్‌కు ఒక స్థానం వచ్చింది. శబరిమల ఆలయం ఉన్న రన్నీ-పెరునాడ్ పంచాయితీ శబరిమల వార్డులో బీజేపీ మూడవ స్థానంలో ఉంది. యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌కు సమంగా ఓట్లు రావటంతో లాటరీలో ఎల్‌డిఎఫ్‌కు వచ్చింది. ఈ పంచాయితీని పది వార్డులతో ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో బీజేపీ 101 కిగాను 50 వార్డులతో అధికారానికి వచ్చింది. సీపీఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ వెల్లడించిన వివరాల ప్రకారం ఓట్ల రీత్యా అక్కడ సీపీఐ(ఎం) ప్రథమ స్థానంలో ఉంది. మీడియాకు ఈ వివరాలు తెలిసినప్పటికీ అది పెద్ద ప్రాధాన్యత కలిగిన అంశం కాదన్నట్లుగా మౌనంగా ఉంది. లోక్‌సభ ఎన్నికలు 2024 లో బీజేపీకి తిరువనంతపురంలో 2,13,214 ఓట్లు వస్తే కార్పొరేషన్ ఎన్నికల్లో అవి 1,65,891 కి తగ్గాయి. యుడిఎఫ్ ఓట్లు 1,84,727 నుంచి 1,25,984 కు పడిపోగా ఎల్‌డిఎఫ్ ఓట్లు 1,29,048 నుంచి 1,67,522 కు పెరిగాయి, అంటే బీజేపీ కంటే స్వల్పంగా ఎక్కువ తెచ్చుకుంది. బీజేపీ గెలిచిన 50 వార్డులలో 40 చోట్ల యుడిఎఫ్ మూడవ స్థానంలో ఉంది. ఇరవై అయిదు వార్డులలో కాంగ్రెస్‌కు కనీసం వెయ్యి ఓట్లు కూడా రాలేదు. కొన్నింటిలో ఐదువందలకు లోపే వచ్చాయి ? కొన్ని చోట్ల బీజేపీ వంద ఓట్ల కంటే తక్కువ మెజారిటీతో గెలిచింది. దీని అర్థం ఏమిటి? పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్ల తీరులో తేడా ఉంటుందన్నది వాస్తవం. అక్కడ గెలిచిన కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆ పార్టీలో ఉంటూనే బీజేపీతో చెలిమి చేస్తున్న సంగతి బహిరంగ రహస్యం. తన పార్టీ తీరుతెన్నులను మరిచిపోయి బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని పొగిడారంటే ఏం జరిగిందో చెప్పనవసరం లేదు. అనేక చోట్ల రెండు పార్టీలు సీపీఎంకు వ్యతిరేకంగా కుమ్మక్కు కావటం గతంలో జరిగింది, ఇప్పుడు కూడా పునరావృతం అయినట్లు కనిపిస్తోంది!

మనుస్మృతిని అంబేద్కర్ ఎందుకు తగలబెట్టారు?



డాక్టర్ దేవరాజు మహారాజు

పైకి ఎదగడానికి ఏమాత్రం వీలులేని కుటుంబంలో పుట్టి, ఏ అవకాశమూ లేని సామాజిక పరిస్థితుల్లో పెరిగి, అస్పృశ్యుడిగా అవమానాల పాలవుతూ కూడా నిబ్బరంగా ఉంటూ, ఆత్మ విశ్వాసంతో, మొక్కవోని దీక్షతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ విశ్వమానవుడిగా ఎదిగిన వారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. ఆ కాలంలో అన్ని పుస్తకాలు చదివి, అన్ని డిగ్రీలు సంపాదించి అత్యున్నత స్థాయికి చేరిన మేధావి కదా ఆయనా? మరి, మనుస్మృతి లాంటి గ్రంథాన్ని బహిరంగంగా, బాహాటంగా, ధైర్యంగా ఎందుకు తగులబెట్టారూ? అలా తగులబెట్టాల్సిన ప్రమాదకరమైన విషయాలు, సమాజానికి హాని కలిగించే విషయాలు అందులో ఏమున్నాయీ? - అని పరిశీలిస్తే... ఉన్నాయి! ఈ అత్యాధునిక వైజ్ఞానిక సమాజాన్ని వెనక్కి నడిపించే చెత్తంతా అందులో ఉంది. అంబేద్కర్ ఆ గ్రంథాన్ని తిరస్కరించడంలో న్యాయముంది. మనువాద భావజాలాన్ని వదులుకోవాల్సి ఉందన్న సందేశం ఈ దేశ ప్రజలకు ఇవ్వడం కోసం ఆయన అలా ఆ గ్రంథాన్ని తగలబెట్టి చూపించారు. అయినా, సమాజంలో రావల్సినంత మార్పు రాలేదు. అణగారిన వర్గాలకు చెందిన వారే మూర్ఖంగా మనువాద భావజాలంలో కొట్టుకుపోతున్నారు. వైదిక ధర్మ ప్రభోదాలకు ప్రభావితులై, వాటిని పాటిస్తూ తాము అగ్రవర్ణాల వారి స్థాయికి చేరుకున్నామని సంతృప్తి పడుతున్నారు. కానీ, అది అర్థం లేనిది. ఏ వర్గం వారైనా, ఏ వర్ణం వారైనా తమ తమ స్థాయి భేదాల్ని వదులుకుని, అందరం మనుషులమేనని గుర్తుంచుకున్న నాడే మానవత్వం పరిమళిస్తుంది. ఆధునిక జన్యుశాస్త్ర సారాంశం గ్రహించిన నాడే మానవవాదం బలపడుతుంది. మనుస్మృతిని అంతా ఇక్కడ పరిచయం చేయబోవడం లేదుగానీ, మానవీయ విలువలకు విఘాతం కలిగించే అంశాలు ఏమేమున్నాయో కొన్నిటిని విశ్లేషించుకుందాం! మతిలేని సూక్తులు ఆ గ్రంథంలో ఇంతగా ఉన్నాయా? అని ఆశ్చర్యపోవాల్సి వచ్చినా... ఏ మాత్రం ఆశ్చర్యపోవద్దు! డా.బి.ఆర్. అంబేద్కర్‌ను అనుసరిస్తే చాలు!!

బ్రాహ్మణుడు మూడు రోజులు పాలు అమ్మితే గనక, అతను శూద్రుడయి పోతాడు (మనుస్మృతి 10/92) అంటే పాల వ్యాపారం చేసేవారు ఎవరైనా బ్రాహ్మణుల దృష్టిలో శూద్రులే - యజ్ఞంలో కొడుకును బలి ఇచ్చినా బ్రాహ్మణుడు బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/105) బ్రాహ్మణుడు కుక్కమాంసం భుజించినా బ్రాహ్మణుడిగానే ఉంటాడు (మనుస్మృతి 10/106 - 10/108) ఇతరులు గనక ఏ మాంస భక్షణ చేసినా పతితులైపోతారు. ఇదేం న్యాయం? ఇక మనుస్మృతి 10 వ అధ్యాయంలోని 95 నుంచి 98 వరకు నాలుగు శ్లోకాల సారాంశమేమంటే- బ్రాహ్మణ వర్ణానికి చెందని తక్కువ స్థాయి వ్యక్తులెవరూ బ్రాహ్మ ణులు చేసే పనులు చేయగూడదు. పైనున్న బ్రాహ్మణ వర్గం వారు మాత్రం అవసరమైనప్పుడు జీవిక కోసం తక్కువ స్థాయి వారి పనులు చేసుకోవచ్చు. ఆ విధంగా కొంచెం నిలదొక్కుకున్న తర్వాత మళ్లీ వారు, వారి కులవృత్తిని స్వీకరించవచ్చు. ఇలాంటి అవకాశం కింది కులాల వారికి లేదు. అంటే బ్రాహ్మణులు బతకడానికి నిమ్న వర్గాల వారి వృత్తులు చేసుకోవచ్చు. నిమ్న వర్గాల వారి బతుకుదెరువు మీద దాడి చేయొచ్చు. వారికి పుట్టగతులు లేకుండా చేసే అధికారం బ్రాహ్మణులకు ఉంది. కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిమ్న వర్గాల వారు పై వర్గం వారి కులవృత్తిని దెబ్బ తీయకూడదు. తమ వర్గం వారికి అనుగుణంగా మనుస్మృతి రాసుకుని, దాన్ని బలవంతంగా జనం మీద రుద్దారు - అని అనడానికి ఇంత కన్నా ఏ సాక్ష్యాలు కావాలీ? ఇందులో ఏ న్యాయముందీ? ఏ మానవీయ విలువలున్నాయీ?

లోకంలో ఉన్న వాస్తవానికీ - మనుధర్మ శాస్త్రంలో వారు రాసుకున్నది పూర్తి వ్యతిరేకం. పూజలు, వ్రతాలు, యాగాలు, కర్మకాండలు వగైరా చేసి భూరి సంభావనలు స్వీకరించి, సంపాదించుకున్నది వారి స్వంత ఆస్తి అని భ్రమ పడుతున్నారు పాపం! బ్రాహ్మణార్యులకు ఉన్న బ్రహ్మ జ్ఞానమేమిటో వివరంగా చెప్పుకుంటే బావుండేది.

ఉత్పత్తి రేవ విప్రస్య మూర్తిర్ధర్మస్య శాశ్వతీ,
సహి ధర్మార్థముత్పన్నో బ్రహ్మభూయాయకల్పతే. 98
బ్రాహ్మణో జాయమానో హి పృథివ్యామధి జాయతే,
ఈశ్వరస్సర్వభూతానాం ధర్మకోశస్య గుప్తయే. 99
సర్వం స్వం బ్రాహ్మణస్యేదం యత్కించి జ్జగతీగతం!
శ్రేష్ఠ్యే నాభిజనేనేదం సర్వం వై బ్రాహ్మ ణో ర్హతి. 100

ఈ సృష్టి యందు ప్రాణులు గొప్పవి. ప్రాణుల యందు బుద్ధి వల్ల జీవించు జీవులు గొప్పవి. ఆ జీవుల యందు మానవులు మిక్కిలి గొప్పవారు. వారిలో బ్రాహ్మణులు గొప్పవారు. ఆ బ్రాహ్మణులలో విద్యాంసులు శ్రేష్ఠులు. ఆ విద్యాంసుల యందు యుక్తాయుక్త విచక్షణ కలవారు శ్రేష్ఠులు. కాగా వారి కంటే బ్రహ్మ జ్ఞానము కలవారు మిక్కిలి గొప్పవారు. ఈ బ్రాహ్మణుడు ధర్మ రక్షణకై పుట్టినాడు. ధర్మాన్ని ఆచరిస్తున్నందు వల్లనే అతడు బ్రహ్మత్వాన్ని పొందుతున్నాడు. ఆతడు సర్వశ్రేష్ఠుడు. అందరకు సమీపస్థుడు కావున, ఈ ప్రపంచమంతయు అతని సొత్తుగానే పరిగణింపబడుచున్నది.

(25 డిసెంబర్ 1927: అంబేద్కర్ మనుస్మృతిని తగలబెట్టిన రోజు.)

పై శ్లోకాలకు తాత్పర్యం అలా ఉంటే, అందులో మనుషులందరిలో బ్రాహ్మణుడు ఎందుకు శ్రేష్ఠుడయ్యాడో వివరణ లేదు. ఇక్కడ ధర్మ రక్షణ అంటే తమ పూట తాము గడుపుకోవడమేనని అర్థం చేసుకోవాలి! వారు కష్టపడిందీ లేదు. ఇతరులకు సహాయపడిందీ లేదు. సామాజిక కార్యాచరణ లోగడ ఏమీ లేదు. ఇప్పుడూ లేదు. భవిష్యత్తులోనూ ఉండదు. పూజలు చేయకపోతే అరిష్టం అని బ్లాక్ మెయిల్ చేసి, భయపెట్టి సొమ్ము లాగేసుకోవడం తప్ప, మరొకటి లేదు కదా? అది అక్రమార్జన అవుతుంది తప్ప సక్రమార్జన కాదు. ఈ దేశం మూఢ నమ్మకాల్లో కూరుకుపోవడానికి వీళ్లే ముఖ్య కారణం! వీరితో పాటు అన్ని మతాల మత బోధకులు కూడా కారణం!!

స్వ మేవ బ్రాహ్మణో భుఙ్తే స్వం వస్తే స్వం దదాతి చ,
అనృశంస్యా ద్బ్రాహణస్య భుంజతే హీతరే జనా: 101

బ్రాహ్మణుడు తన సొత్తును తానే అనుభవించుచున్నాడు. తన వస్త్రమును తానే ధరించుచున్నాడు. తన వస్తువులనే దానము చేయుచున్నాడు పైగా అతని దయా దాక్షిణ్యముల వలన ఇతరులు బ్రాహ్మణుని సొత్తు ననుభవించుచున్నారు.

ఈ శ్లోకాన్ని, దాని తాత్పర్యాన్ని అర్థం చేసుకుని, కొంచెం ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం బోధపడుతుంది. సరే - ఇంగిత జ్ఞానమంటే ఏమిటీ? అని అడిగే వారే ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. అందుకే కదా జనాన్ని ఆలోచింపజేయడానికి ఈ ప్రయత్నం?

శ్రమజీవుల్ని అదిరించి, బెదిరించి సంపాదించిన సొత్తు శతాబ్దాలుగా అన్యాయంగా అనుభవిస్తున్నారన్నది వాస్తవం. వారు తినే తిండి వారు పండించుకున్నది కాదు. వారు కట్టుకునే గుడ్డ వారు నేసుకున్నది లేదు. కాళ్లకు వేసుకునే చెప్పులు వారు కుట్టుకున్నవి కావు. మాసిన గుడ్డలు వారు ఉతుక్కున్నది లేదు. వారు వాడుకునే ఏ వస్తువూ వారు తయారు చేసుకున్నది కాదు. ఒళ్లు వంచింది లేదు. చెమట కార్చిందీ లేదు. అప్పనంగా వచ్చింది కూర్చుని ఆరగించడం తప్ప, శ్రమశక్తి విలువ ఏమిటో వారికేమి తెలుసూ? యదార్థం ఆలోచిస్తే, దానాలు వీరు స్వీకరించడమే గానీ, మరొకరికి వీరిచ్చిందెపుడూ? ఒకసారి గతాన్ని నెమరు వేసుకుని చూడండి.

తోటి మనుషుల పట్ల మనువాదుల అభిప్రాయాలు, ఆలోచనలు ఎంత నీచంగా ఉంటాయో గమనించండి-

పంది వాసన చూచుట చేతను, కోడి రెక్కల గాలి చేతను, కుక్క చూపు పడుట వలనను, శూద్రుడు తాకుట చేతను పదార్థములు అపరిశుద్ధమగును. (మనుస్మృతి 3-24) ఇది ఒప్పుకోదగ్గదేనా?

అసలైన పరిణామవాదం మనుధర్మ శాస్త్రంలో ఉంది- చూస్కోండి! ఒకటవ అధ్యాయం 9-12 శ్లోకాలలోనే అంతా ఉంది. బ్రహ్మ అండం నుంచి పుట్టాడు. పుట్టి ఆ అండాన్ని తనే స్వయంగా రెండుగా విడగొట్టాడు. ఆ రెండు భాగాల నుంచి ఇంకా ఏమేమి సృష్టించాడో 13 వ శ్లోకంలో ఉంది. ఆ పదమూడవ శ్లోకం ప్రకారం ఆకాశం, పృథ్వి, ఆ రెండింటి మధ్య స్వర్గం ఏర్పరిచాడు. ఇంకా వాటి వెంట ఎనిమిది దిక్కులు, ఎనిమిది సముద్ర జలాలు సృష్టించాడు. ఇంత అత్యద్భుతమైన పరిణామ సిద్ధాంతం మనకు మనువాదులు ఇస్తే, దాన్ని గుర్తించకుండా అనవసరంగా డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం వెనక పడ్డారెందుకూ? పాపం! ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని మనం అనవసరంగా ఆడిపోసుకుంటున్నామా? ప్రపంచం ఆమోదించిన డార్విన్ సిద్ధాంతం పాఠ్య గ్రంథాల్లోంచి తీసేసి భావి భారత పౌరుల జీవితాల్లో చీకటి నింపకండని అనవసరంగా గగ్గోలు పెడుతున్నామా? ఒక్కసారి ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే ఎవరి జవాబు వారికే లభిస్తుంది. మనమేమంటున్నామనీ? ప్రభుత్వం వారు అతిగా స్పందిస్తున్నారూ? ఉన్నది ఉన్నట్టుగా చెప్పి, ఆలోచించుకునే స్వేచ్ఛ జనానికి ఇవ్వండని అంటున్నాం! అంతే- కల్లబొల్లి కబుర్లు చెప్పి జనాన్ని మభ్యపెట్టకండని అంటున్నాం. అయినా జనం గతంలో లాగా అమాయకత్వంలో ఏమీ కూరుకుపోలేదు. వారు తెలుసుకుంటున్నారు. ఆలోచిస్తున్నారు. విశ్లేషించుకుంటున్నారు. వాస్తవాల వైపు, నిజాల వైపు ఆకర్షితులవుతున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన 'పరిణామాన్ని' మనం ఆహ్వానించాలి!

ఈ ఆధునిక వైజ్ఞానిక యుగానికి సరిపడే విధంగా మనుషుల ఆలోచనా ధోరణిలో మార్పు రావాలన్న తపన తప్ప, మనుస్మృతి పేరుతో ఒక వర్గం వారిని ఉద్దేశించి, వారిని ఎద్దేవా చేయడానికి రాస్తున్నది కాదు. ఇందులోని అమానవీయమైన విషయాలని మన రాజ్యాంగం, కోర్టులు ఒప్పుకుంటాయా అన్న ఆవేదన, ఆందోళన తప్ప ఎవరినో తక్కువ చేసి చూపడానికి కాదు! గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దే బాధ్యత ఈ దేశ పౌరులందరిది - అని గుర్తు చేయడం కోసమే ఈ విషయాల్ని ఇక్కడ సమీక్షించడం జరిగింది. శతాబ్దాలుగా ద్వేషం పెంచి పోషించి, మనుషుల్ని విభజించింది చాలదా? ఇకనైనా దృక్పథాలు మార్చుకోవాల్సిన అవసరం లేదా?

"నువ్వు ఆనందకరమైన జీవితం గడపాలనుకుంటే, దాన్ని వ్యక్తులతోనో లేక వస్తువులతోనో గాక, ఒక లక్ష్యంతో ముడి పెట్టుకో-" ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త, -ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

రచయిత: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త

ఉత్తరాఖండ్‌లో ఢీకొన్న రైళ్లు

90 మందికి గాయాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. టీహెచ్‌డీసీ నిర్మిస్తున్న విష్ణుగఢ్-పీపల్‌కోటి జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన పీపల్‌కోటి సొరంగంలో మంగళవారం అర్ధరాత్రి రెండు లోకోమోటివ్ రైళ్లు ఢీకొన్నాయి. షిఫ్ట్ మారుతున్న సమయంలో కార్మికులు, అధికారులను తీసుకువెళ్తున్న రైలు... మెటీరియల్‌తో వస్తున్న మరో రైలును ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. లోకోమోటివ్ రైళ్లు ఢీకొన్న సమయంలో రైళ్లో మొత్తం 109 మంది ఉన్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘర్షణతో సొరంగం లోపల కార్మికులు భయాందోళనకు గురై కేకలు వేశారు. చీకటిగా ఉండే సొరంగం లోపల ఈ ప్రమాదం జరగడంతో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో మొత్తం 90 మందికి గాయాలు కాగా, వారిలో 10 మందిని గోపేశ్వర్‌లోని జిల్లా ఆసుపత్రికి, మరో 17 మందిని పీపల్‌కోటిలోని వివేకానంద ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ప్రాథమిక చికిత్స అందించారు. సమాచారం అందిన వెంటనే జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ కుమార్ అధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. లోపల చిక్కుకున్న కార్మికులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని, ప్రస్తుతం ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆయన స్పష్టం చేశారు. సాధారణంగా పొడవైన సొరంగాల్లో కార్మికులను, మెటీరియల్‌ను చేరవేయడానికి ఇలాంటి లోకోమోటివ్ రైళ్లను ఒకే ట్రాక్‌పై ఉపయోగిస్తుంటారు. అయితే, సిగ్నలింగ్ లోపమా లేక మరేదైనా కారణమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అలకనంద నదిపై 444 మెగావాట్ల సామర్థ్యంతో ఈ విష్ణుగఢ్-పీపల్‌కోటి జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నాటికి దీనిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

శ్రీనగర్: కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో దేశంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. దిల్లీ నుంచి కన్యాకుమారి వరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు పెంచారు. వివిధ చోట్ల ఆయా సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి స్థానిక పోలీసులు, ఆర్మీ దళాలు కలిసి వాహనాల తనిఖీలు చేపట్టాయి. ఎముకలు కొరికే ప్రాంతం దోడాలోని భలేసా అనే ఎత్తైన ప్రదేశాల్లో సైతం భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదుల చొరబాటును నిలువరించేందుకు డేగ కన్నులతో పహరా కాస్తున్నారు. దోడాలోని గడ్డకట్టిన అడవులు, దాచిన్ పర్వత గుహలలో దళాలు గస్తీకాస్తున్నాయి.

రైతు కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయియా చక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్విందర్ (47) అనే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ.25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లఖ్విందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్-మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.

కత్తులు పంచుతున్న 10 మంది అరెస్టు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో కత్తులు పంచుతున్న 10 మందిని అరెస్టు చేశారు. హిందూ రక్షా దళ్‌కు చెందిన కార్యకర్తలు ఘజియాబాద్‌లో కత్తులు పంపిణీ చేస్తున్నట్లు ఓ వీడియో వైరల్ అయింది. ఈ నెల 29న జరిగిన ఈ ఘటనకు సంబంధించి 46 మందిపై కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని 191(2), 191(3), 127(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘజియాబాద్‌లోని షాలిమార్ గార్డెన్‌లో ఉన్న ఆఫీసులో కత్తులను పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ కార్యాలయం నుంచి ఎనిమిది కత్తులను స్వాధీనం చేసుకున్నారు. హిందూ రక్షా దళ్ జాతీయ అధ్యక్షుడు పింకీ చౌదరీ కత్తులను పంచుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ ఘటనపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. దీంతో విపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి.

కలుషిత నీరు తాగి 8 మంది మృతి

భోపాల్: బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ భగీరత్‌పుర కాలనీలో కలుషిత నీరు తాగి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ఆసుపత్రి పాలయ్యారు. అధికారుల వివరాల ప్రకారం... ఈ నెల 25న మున్సిపల్ అధికారులు సరఫరా చేసిన కొళాయి నీటిలో ఓ విధమైన వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. ఆ నీటిని తాగి పలువురు అస్వస్థతకు గురవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అధికారులు ఆ కాలనీకి చేరుకొని నీటిని పరిశీలించారు. నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. అస్వస్థతకు గురైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ పరిస్థితి విషమించి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, తాగునీటి పైపులైన్లలో మురుగునీరు కలవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మేయర్ తెలిపారు.

మోదీ విధ్వంస పాలన

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే ధ్వజం

న్యూదిల్లీ: ఈ ఏడాది(2025) కూడా బీజేపీ 'దోపిడీ, అవినీతి, దుర్మార్గపాలన' సాధారణ పౌరుల జీవితాలను శాసించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సంవత్సరం చివరి రోజున అన్నారు. 2025లో మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ ఒక జాబితా విడుదల చేసింది. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీపై సుదీర్ఘ ఆరోపణల జాబితాను ఖడ్గే బుధవారం వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, సామాజిక న్యాయం, జాతీయ భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం నిర్వహించిన తీరుపై ఆయన మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'సంవత్సరం చివరి రోజున బీజేపీ పాలనలో 11వ సంవత్సరమైన 2025లో దేశాన్ని ఎలా పరిపాలించారో అందరికీ గుర్తు చేయడం చాలా అవసరం' అని ఖడ్గే (గతంలో ట్విట్టర్) లో హిందీలో పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రభుత్వ వైఫల్యాలుగా ఆయన అభివర్ణించిన అనేక అంశాలను ఆయన జాబితా చేశారు. ఎన్నికల ప్రక్రియలు, జాతీయ భద్రత, విదేశాంగ విధానం, సంక్షోభ నిర్వహణలో వైఫల్యాలను, అలాగే అణగారిన వర్గాలపై పెరుగుతున్న అకృత్యాలు, తీవ్రమవుతున్న పర్యావరణ, వాయు కాలుష్య సమస్యలను కూడా ఆయన ఎత్తి చూపారు. 'ఎంజీఎన్ఆర్ఈజీఏను రద్దు చేయడం ద్వారా, లక్షలాది మంది పేదల నుంచి 'పని హక్కు'ను లాక్కున్నారు. ఎలాంటి సన్నాహం లేకుండా, బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వకుండా, ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది నుంచి 'ఓటు హక్కు'ను లాక్కున్నారు. బీజేపీ ఓట్ల దొంగతనంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఆర్థిక అసమానతల అగాధం మరింతగా పెరిగింది. భారతదేశ సంపద 40 శాతం అగ్రశ్రేణి 1 శాతం మంది చేతిలో ఉంది. రూపాయి పాతాళానికి పడిపోతోంది. ఆర్‌బీఐ 32 బిలియన్ డాలర్లు (2.8 లక్షల కోట్ల రూపాయలు) విలువైన అమెరికన్ డాలర్లను విక్రయించినప్పటికీ, దానివల్ల ఎలాంటి మార్పు రాలేదు. యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయిలో ఉంది. ప్రశ్నపత్రాల లీక్ మాఫియా ఆట నిరాటంకంగా కొనసాగుతోంది. మోదీ స్నేహితుడు 'నమస్తే ట్రంప్' మన దేశంపై ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను విధించారు. పుల్వామా ఉగ్ర దాడి తర్వాత మన శక్తివంతమైన సైన్యం తగిన ప్రతీకారం తీర్చుకుంది. కానీ బీజేపీ మంత్రులు మన కల్నల్ గురించి సిగ్గుచేటయిన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కనీసం 60 సార్లు 'మధ్యవర్తిత్వం' గురించి చెప్పారు. ఇప్పుడు చైనా కూడా 'మధ్యవర్తిత్వం' గురించి మాట్లాడుతోంది. కానీ మోదీ మౌనంగా ఉన్నారు' అని విమర్శించారు. 'పెరుగుతున్న సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతూనే, పరిపాలనా లోపాలు, మానవ విషాదాలకు ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకుందని ఖడ్గే ఆరోపించారు. మణిపూర్‌లో మోదీ-షా వైఫల్యం చెందారు. దానిని కప్పిపుచ్చడానికే రాష్ట్రపతి పాలన విధించారు. ద్రవ్యోల్బణం నుంచి ఎలాంటి ఉపశమనం లేదు. జీఎస్టీ నుంచి తగ్గింపు కేవలం లెక్కల గారడీ అని తేలింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలపై అకృత్యాలు పెరిగిపోయాయి. చివరికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా వదల్లేదు. దేశ రాజధాని దిల్లీతో పాటు ఉత్తర భారతదేశమంతా విషపూరిత వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక లేదు. కేవలం డొల్ల మాటలే. అరావళి పర్వతాలను మైనింగ్ మాఫియాకు అప్పగించే కుట్ర. నికోబార్, హస్దియో, ముంబై మడ అడవులపై దాడులు. కుంభమేళా తొక్కిసలాట అయినా, దిల్లీ స్టేషన్ గందరగోళం అయినా, దగ్గు మందు వల్ల అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా ఎవరూ బాధ్యత వహించడం లేదు' అని పేర్కొన్నారు. తన విమర్శలను ముగిస్తూ 'మొత్తం మీద, 2025లో కూడా బీజేపీ దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలన దేశ ప్రజలపై తీవ్రంగా కొనసాగింది' అని ఖడ్గే తెలిపారు.

చైనా వాదనపై ప్రధాని స్పందించాలి

కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్



న్యూదిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు చైనా చేస్తున్న వాదనలపై భారత ప్రజలకు స్పష్టత అవసరమని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఈ వాదనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మౌనం వీడాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కోరారు. ఈ ఆరోపణ దేశ జాతీయ భద్రతను అపహాస్యం చేసేలా ఉందని అన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మే 10, 2025న ఆపరేషన్ సిందూర్‌ను ఆపడానికి తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకున్నానని చాలా కాలంగా చెబుతున్నారు. కనీసం ఏడు వేర్వేరు దేశాలలోని వివిధ వేదికలలో 65 వేర్వేరు సందర్భాలలో ఆయన అలా చేశారు. తన మంచి స్నేహితుడు అని చెప్పుకునే వ్యక్తి చేసిన ఈ వాదనలపై ప్రధాన మంత్రి ఇప్పటికీ మౌనం వీడలేదు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి కూడా ఇలాంటి వాదనే చేస్తున్నారు. చైనా కూడా మధ్యవర్తిత్వం వహించిందని చెబుతున్నారు. జులై 4, 2025న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం వాస్తవానికి చైనాను ఎదుర్కొంటోందని, పోరాడుతోందని బహిరంగంగా ప్రకటించారు. 'చైనా పాకిస్థాన్‌తో నిర్ణయాత్మకంగా పొత్తు పెట్టుకున్నందున, భారతదేశం, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా వాదనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అవి మన దేశ ప్రజలు నమ్ముతున్న దానికి ప్రత్యక్షంగా విరుద్ధంగా ఉండటం వల్లనే కాదు. వారు మన జాతీయ భద్రతనే ఎగతాళి చేస్తున్నట్లు కనిపిస్తున్నందున' అని ఆయన తెలిపారు. చైనాతో మన సంబంధం సందర్భంలో కూడా ఈ వాదనను అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. 'మేము వారితో తిరిగి చర్చలు ప్రారంభించాము. కానీ దురదృష్టవశాత్తు అది చైనా నిబంధనలపై ఉంది. జూన్ 19, 2020న చైనాకు ప్రధాన మంత్రి క్లీన్ చిట్ ఇవ్వడం భారతదేశం చర్చల స్థానాన్ని గణనీయంగా బలహీనపరిచింది' అని ఆయన అన్నారు. మన వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో ఉందని, దేశ ఎగుమతులలో ఎక్కువ భాగం చైనా నుండి దిగుమతులపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌కు సంబంధించి చైనా రెచ్చగొట్టే చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. 'ఇటువంటి అసమానమైన, శత్రుత్వంతో కూడిన సంబంధాల మధ్య ఆపరేషన్ సిందూర్‌కు ఆకస్మికంగా అంతరాయం కలగడంలో చైనా పోషించిన పాత్రపై భారతదేశ ప్రజలకు స్పష్టత అవసరం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ ఏడాది చైనా మధ్యవర్తిత్వం వహించిన కీలక సమస్యల జాబితాలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కూడా ఉన్నాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మంగళవారం అన్నారు. మే 7-10 తేదీల మధ్య భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన సంఘర్షణ రెండు దేశాల సైన్యాల డీజీఎంఓల (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా పరిష్కరించబడిందని న్యూదిల్లీ చెబుతూ వస్తోంది. అయితే భారత్, పాకిస్థాన్‌కు సంబంధించిన విషయాలలో ఏ మూడవ పక్షం జోక్యానికి తావు లేదని కూడా భారతదేశం నిలకడగా చెబుతోంది.

ఎవరి జోక్యం లేదు

పాక్‌తో కాల్పుల విరమణపై భారత్

న్యూదిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి జోక్యం లేదని స్పష్టం చేసింది. ఇది రెండు దేశాల సైనిక డీజీఎంఓలు చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, ఇందులో మూడో పక్షం పాత్ర లేదని పునరుద్ఘాటించింది. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఇప్పటికే పలు సందర్భాల్లో తమ వైఖరి స్పష్టం చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా మంత్రి వాంగ్ యీ మంగళవారం ప్రకటించారు. ఉత్తర మైన్మార్ సంక్షోభం, ఇరాన్ అణు సమస్య, ఇజ్రాయిల్-పలస్తీనా ఉద్రిక్తతల పరిష్కారాని కూడా తాము మధ్యవర్తిత్వం వహించామని చెప్పారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ అంగీకారం కుదిర్చారంటూ భారతీయ మూలాలున్న ట్రంప్ సహాయకుడు రికీ గిల్‌ను అమెరికా ప్రభుత్వం తాజాగా సత్కరించి, అవార్డు ప్రదానం చేసింది.

రిపబ్లిక్ డే పరేడ్‌లో యానిమల్ కంటింజెంట్

న్యూదిల్లీ: దిల్లీలోని కర్తవ్యపథ్‌లో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ కవాతులో ఈసారి ఓ అరుదైన కంటింజెంట్ చేరనుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో తొలిసారిగా యానిమల్ కంటింజెంట్‌ను తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నామని అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, పది స్వదేశీ జాతి ఆర్మీకి చెందిన జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉన్నాయి.

నారాయణ గురు సిద్ధాంతాల వక్రీకరణ: విజయన్

తిరువనంతపురం: ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీనారాయణ గురు సిద్ధాంతాన్ని వక్రీకరించి హైజాక్ చేసేందుకు యత్నిస్తున్న స్వార్థపూరిత శక్తులపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ గురుని ఒక నిర్దిష్ట మతం లేదా సమాజానికి పరిమితం చేసే ఇటువంటి ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వర్కాలలో నారాయణ గురు స్థాపించిన శివగిరి మఠంలో బుధవారం 93వ శివగిరి యాత్రను ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా మానవత్వం, ఐక్యత, సౌభ్రాతృత్వం, స్నేహ మార్గాన్ని మానవాళికి చాటి చెప్పిన నిజమైన ప్రపంచ గురువు శ్రీనారాయణ గురు అని అన్నారు. వివిధ కుల, మత సమూహాలను చిన్నాభిన్నం చేయడం ప్రజాస్వామ్య, లౌకిక భావాలను బలహీనపరుస్తుందని హెచ్చరించారు. సమానత్వం... సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసేందుకు, దేశ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రగతిశీల శక్తుల దృక్పథంతో నారాయణ గురు సందేశాన్ని అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. గుర్తింపు ప్రాతిపదికన ప్రజలను విభజించే యత్నాలను ప్రతిఘటించడానికి, నారాయణ గురు బోధనల్లో కీలకమైన ప్రజాస్వామ్య ...లౌకిక విలువలను బలోపేతం చేయడానికి సమిష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నటి నుస్రత్ 'మహాకాల్' సందర్శన

ముస్లిం పెద్దల ఆగ్రహం

న్యూదిల్లీ: ఉజ్జయినిలోని శ్రీ మహాకాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సందర్శించిన ప్రముఖ నటి నుస్రత్ భరూచాపై ముస్లిం పెద్దలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె ఇటీవల మహాకాళేశ్వరుడి భస్మ హారతిలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఆ పరమేశ్వరుడి ఆశీర్వాదం పొందాలనే ఉద్దేశంతో నుస్రత్ ఆలయాన్ని సందర్శించారు. ముస్లిం మహిళ అయిన నుస్రత్ మహాకాల్‌ను సందర్శించడంపై కొందరు ప్రశ్నించారు. ముఖ్యంగా, నుస్రత్‌పై ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా ముస్లిం జమాత్ జాతీయ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వి మాట్లాడుతూ షరియా చట్టం ప్రకారం ఆమె పూజలు చేయడం, గంధం పూసుకోవడం ఘోర పాపం అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ఇస్లాం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ఆయన అన్నారు. నటి పశ్చాత్తాపం చెంది... కల్మా పఠించాలని మౌలానా డిమాండ్ చేశారు. అయితే, నుస్రత్ భరూచా తన మత విశ్వాసాలపై తన ఉదారవాద అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించారు. శుభంకర్ మిశ్రాతో ఒక ఇంటర్వ్యూలో ఆలయం, మసీదు లేదా చర్చి వంటి ప్రార్థనా స్థలాలలో శాంతిని పొందడాన్ని తాను నమ్ముతానని అన్నారు. 'మీకు ఎక్కడ శాంతి లభిస్తే, అది మందిరంలో అయినా, గురుద్వారాలో అయినా, చర్చిలో అయినా మీరు అక్కడికి వెళ్లాలి. నేను ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. నాకు సమయం దొరికితే రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తాను. ఒకే దేవుడు ఉన్నాడని, ఆయనతో అనుసంధానం కావడానికి వేర్వేరు మార్గాలు ఉన్నాయని నేను ఎప్పుడూ నమ్ముతాను. నేను ఆ మార్గాలన్నింటినీ అన్వేషించాలనుకుంటున్నాను' అని ఆమె అన్నారు.

కశ్మీర్ లోయలో మంచు దుప్పటి

శ్రీనగర్: కశ్మీర్ లోయలో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ ప్రాంతమైన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు కనిపిస్తోంది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిస రాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భు తంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలు టూరిస్టులకు కనువిందు చేస్తు న్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తుంది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మంచును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

కారులో మహిళపై గ్యాంగ్‌రేప్

ఫరీదాబాద్‌లో దారుణం

చండీగఢ్: హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో ఓ యువతి(25)పై ఇద్దరు వ్యక్తులు అఘాయిత్యానికి ఒడిగట్టారు. కదులుతున్న కారులో దాదాపు రెండు గంటల పాటు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకోగా... ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ మహిళ తన తల్లితో గొడవపడి స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో తన సోదరికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. మూడు గంటల్లో ఇంటికి వచ్చేస్తానని తెలిపింది. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపై వాహనం కోసం ఎదురుచూస్తోంది. అదే సమయంలో కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు మహిళను కారులో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయారు. అనంతరం దాదాపు రెండున్నర గంటలపాటూ కదులుతున్న కారులోనే ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తెల్లవారుజామున రాజ్‌చౌక్ వద్ద రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటనలో ఆమె ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. మహిళ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో యువతి తన సోదరికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితురాలిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమె ముఖంపై 12 కుట్లు వేశారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆ వివాహిత మహిళకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గొడవల కారణంగా భార్యా భర్తలు విడివిడిగా ఉంటున్నట్లు బాధితురాలి సోదరి తెలిపింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల్ని పట్టుకున్నారు. అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు.

ఆశల పల్లకిలో భారత వృద్ధిరేటు

న్యూదిల్లీ: అభివృద్ధి విషయంలో భారత్ అగ్రదేశాలతో పోటీ పడుతోంది. జీడీపీ విషయంలో ఇప్పటికే జపాన్‌ను వెనక్కు నెట్టింది. నాల్గవ అతి పెద్ద దేశంగా నిలిచింది. భారత్ జీడీపీ 4.18 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. మొదటి మూడు స్థానాల్లో అమెరికా, చైనా, జర్మనీ దేశాలు ఉన్నాయి. భారత్ 2030 నాటికి జర్మనీని దాటేసి మూడో స్థానంలో నిలిచే అవకాశం ఉంది. 2025-2026 రెడో త్రైమాసికంలో భారత వాస్తవ జీడీపీ 8.2కు చేరింది. అంచెలంచెలుగా ముందుకు దూసుకుపోతోంది. 2030 నాటికి భారత జీడీపీ 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మొదటి స్థానంలో అమెరికా ఉండగా... రెండో స్థానంలో చైనా ఉంది. ఈ రెండింటిని దాటి మొదటి స్థానంలో నిలిచే దిశగా భారత్ అడుగులు ముందుకు వేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై గట్టి నమ్మకంతో ఉన్నాయి. భారత వృద్ధిరేటు 2026లో 6.5కు చేరే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ చెబుతోంది. మూడీ అంచనా ప్రకారం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జీ20 ఎకానమీ దేశంగా భారత్ నిలవనుంది. వృద్ధిరేటు 2026లో 6.4 శాతం, 2027లో 6.5 శాతంగా ఉండనుంది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు భారత్ వృద్ధి అంచనాలు పెంచుతున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి 2025 సంవత్సరానికిగాను భారత వృద్ధి రేటును 6.6 శాతంగా, 2026కి 6.2 శాతంగా అంచనా వేసింది. సీఈసీడీ కూడా 2025లో 6.7 శాతం, 2026లో 6.2 శాతం వృద్ధి నమోదు అవుతుందని వెల్లడించింది. ఎస్ అండ్ పీ సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం, వచ్చే ఏడాదిలో 6.7 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేస్తోంది. ఆసియా అభివృద్ధి బ్యాంక్ 2025కి తన అంచనాను పెంచుతూ 7.2 శాతం వృద్ధి ఉంటుందని చెప్పింది.

ఇదిలా ఉండగా దేశంలోని ప్రధాన ఆర్థిక సూచీలు సానుకూలంగానే ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ద్రవ్యోల్బణం అనుమతించిన కనిష్ట స్థాయికి దిగువన కొనసాగుతుండగా... నిరుద్యోగం క్రమంగా తగ్గుముఖం పడుతోందని, ఎగుమతులు కూడా స్థిరంగా మెరుగుపడుతున్నట్లు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. వాణిజ్య రంగానికి బలమైన రుణ ప్రవాహం కొనసాగుతుండటంతో ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో వినియోగం పెరుగుతుండటం వల్ల ఆర్థిక వృద్ధికి మరింత ఊతం లభిస్తోందని ప్రభుత్వం గొప్పగా చెబుతోంది.

మద్యం ప్రియులను ఇంటిదగ్గర దించుతాం

కర్నాటక మంత్రి పరమేశ్వర

బెంగళూరు: నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోయి మితిమీరి మద్యం సేవించినవారితో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విచ్చలవిడిగా తాగిన వారిని తమ ఇళ్ల దగ్గర దింపుతామని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర వెల్లడించారు. బెంగళూరు పోలీసులు ఈ బాధ్యతలు చూసుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరిని ఇంటివద్ద వదలడం వీలుకాదు కాబట్టి... మత్తు దిగేవరకు వారిని ఉంచడానికి 15 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. తాగినమైకంలో అసభ్యంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బార్లు, పబ్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 'కొన్ని జిల్లాలతో సమస్య లేదు కానీ... రద్దీ ఎక్కువగా ఉండే బెంగళూరు, మైసూర్, హుబ్బళి, బెలగావి, మంగళూరులో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశాం' అని మంత్రి చెప్పారు. ఈ ఏర్పాట్లపై ఇప్పటికే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మాట్లాడారు. 'ట్రాఫిక్, మహిళల భద్రతను దృష్టిపెట్టుకొని బెంగళూరు వ్యాప్తంగా 20 వేలమంది పోలీసు సిబ్బందిని మోహరించాం. వారిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళా బృందం కూడా ఉంది. అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నాం' అని డీకే వెల్లడించారు.

కొత్త సంవత్సరానికి న్యూజిలాండ్ స్వాగతం

సిడ్నీ, హాంగ్‌కాంగ్, బాలీలో వేడుకల రద్దు

ఆక్లాండ్: నూతన సంవత్సరానికి న్యూజిలాండ్ ఘన స్వాగతం పలికింది. ప్రపంచ దేశాల్లో అన్నింటి కంటే ముందుగా ఆక్లాండ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుతారు. అత్యంత ఎత్తైన భవనం స్కై టైవర్ నుంచి అందమైన బాణాసంచా పేలుళ్ల ప్రదర్శనతో 2026కి ఆక్లాండ్ స్వాగతం పలికింది. 787 అడుగుల ఎత్తైన స్కైటవర్ నుంచి 3,500 బాణాసంచా పేలుళ్లతో ఐదు నిమిషాల రంగురంగుల బాణాసంచా పేలుళ్ల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన దృష్ట్యా న్యూజిలాండ్‌వ్యాప్తంగా చిన్న స్థాయి వేడుకలన్నీ రద్దు అయ్యాయి. న్యూజిలాండ్‌కు వేడుకలు జరిగిన రెండు గంటలకు ఆస్ట్రేలియా కొత్త సంవత్సరాన్ని స్వాగతించింది. గత 30 ఏళ్లలో జరగని విధంగా బోండీ బీచ్‌లో కాల్పుల ఘటన దృష్ట్యా రాజధాని సిడ్నీ మార్బర్ బ్రిడ్జి వద్దకు బాణాసంచా ప్రదర్శనను వీక్షించేందుకు వచ్చే వారి దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. వేలాది మంది పోలీసులతో బందోబస్తు చేశారు. భద్రతాధికారులు రాపిడ్-ఫైర్ రైఫిళ్లతో మోహరించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఒక గంట ముందు బోండీ బీచ్ మృతులకు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. అదే విధంగా హాంగ్‌కాంగ్ కూడా వేడుకలను రద్దు చేసుకుంది. కనివినీ ఎరుగని రీతిలో బహుళ అంతస్తుల భవనం మంటల్లో చిక్కుకొని అనేక మంది ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ఈ సంవత్సరం సంబరాలకు హాంగ్ కాంగ్ దూరంగా ఉంది. కాగా, భారీ నష్టాన్ని మిగిల్చిన సమత్రా వరదల కారణంగా ఇండోనేసియాలోనూ వేడుకలు రద్దు చేశారు.

మృతులకు సతాపసూచికంగా రాజధాని జకార్త, పర్యాటక క్షేత్రం బాలీ సహా ఎక్కడ కూడా బాణాసంచా ప్రదర్శనను అనుమతించలేదు. సుమత్రా వరదల్లో 1,100 మంది ప్రాణాలు కోల్పోగా, నాలుగు లక్షల మంది నిర్వాసితులయ్యారు. అదే విధంగా జపాన్ రాజధాని టోక్యో, సెర్బియా రాజధాని బెల్‌గ్రాడ్, ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోనూ వివిధ భద్రతాపరమైన కారణాలతో కొత్త సంవత్సరం వేడుకలు చాలా వరకు రద్దు చేశారు. మిగతా ప్రపంచంలో పోల్చుకుంటే దక్షిణ పసిఫిక్ దేశాలు కొత్త సంవత్సరానికి మొదటగా స్వాగతం పలికాయి. సిడ్నీకి రెండు గంటలు, న్యూయార్క్‌కు దాదాపు 18 గంటల ముందుగానే న్యూజిలాండ్ నూతన సంవత్సరాన్ని స్వాగతించింది.

మరింత క్రియాశీల విధానాలు తెస్తాం

కొత్త సంవత్సరం తేనీటి విందులో జిన్‌పింగ్



బీజింగ్: నూతన సంవత్సరంలో మరింత క్రియాశీలమైన, సమర్థ విధానాలు అమలు చేస్తామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడించారు. దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యంతో ఆర్థిక పురోగతి దృష్ట్యా పటిష్ట కార్యాచరణలతో ముందుకు వెళతామని చెప్పారు. 2025కి నిర్దేశించిన ఐదు శాతం ఆర్థిక వృద్ధి లక్ష్యాన్ని దాదాపుగా చేరుకున్నట్లు తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ 140 ట్రిలియన్ యువాన్‌కు చేరుకున్నదన్నారు. 2026లోకి అడుగు పెట్టే క్రమంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకత్వానికి జిన్‌పింగ్ తేనీటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిళ్ల నడుమ చైనా ఆర్థిక వ్యవస్థ తన స్థితిస్థాపకతను, సామర్థ్యాన్ని రుజువు చేసుకుంటూ ముందుకు వెళు తోందని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో పరిమాణాత్మక వృద్ధి సాధిస్తూనే సామాజిక సామరస్యం, సుస్థిరతకు విఘాతం కలిగకుండా ఓ పద్ధతి ప్రకారం నడుచుకుంటున్నట్లు తెలిపారు.

భారత్-పాక్ శాంతికి చైనా దౌత్యం: వాంగ్ యీ

ఈ ఏడాది చైనా మధ్యవర్తిత్వం వహించిన 'హాట్‌స్పాట్' అంశాల్లో భారత్-పాకిస్థాన్ ఘర్షణలు ఉన్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు.'రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం స్థానిక యుద్ధాలు, సరిహద్దు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. భౌగోళిక-రాజకీయ ప్రకంపనలు వ్యాప్తి చెందాయి. సుస్థిర శాంతి కోసం లక్షణాలు, మూల కారణాలపై దృష్టిని కేంద్రీకరించాం. 'హాట్‌స్పాట్' అంశాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించారు. ఉత్తర మైన్మార్, ఇరాన్ అణు సమస్య, పాకిస్థాన్- భారత్ ఘర్షణలు, పలస్తీనా-ఇజ్రాయిల్ సమస్యలతో పాటు ఇటీవల కంబోడియా, థాయిలాండ్ మధ్య ఘర్షణలను పరిష్కరించేందుకు మా పద్ధతిలో ప్రయత్నించాం' అని బీజింగ్‌లోని చైనా విదేశాంగ సంబంధాలు, అంతర్జాతీయ పరిస్థితులపై సమావేశంలో వాంగ్ యీ వెల్లడించారు.

ఖలీదా జియాకు అంతిమ వీడ్కోలు

ఢాకా: బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా అంత్యక్రియలు ముగిశాయి. కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుధవారం మధ్యాహ్నం రాజధాని ఢాకాలోని మానిక్ మియా అవెన్యూలో నమాజే జనాజా (ప్రత్యేక ప్రార్థన) అనంతరం ఆమె అంతిమసంస్కారలు నిర్వహించారు. ఖలీదా జియా భౌతికకాయాన్ని చంద్రిమా ఉద్యాన్ (శ్మశానం)కు తరలించారు. ఆమె భర్త, మాజీ అధ్యక్షుడు జియార్ రెహమాన్ సమాధి పక్కనే ఖలీదా జియాను ఖననం చేశారు. అంతిమ యాత్రలో బీఎన్‌పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు తదితరులు వేలాది మంది పాల్గొన్నారు. అభిమాన నాయకురాలికి కన్నీటి వీడ్కోలు పలికారు. ఖలీదా జియా మరణంతో ఓ రాజకీయ శకం ముగిసిందని పార్టీలకు అతీతంగా నాయకులు, విదేశీ ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఆమె కుమారుడిని పరామర్శించారు. అంత్యక్రియల్లో దేశ తాత్కాలిక అధినేత మహమ్మద్ యూనస్, త్రివిధ దళాధిపతులు, పాలక పక్ష నాయకులు తదితరులు హాజరయ్యారు. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో పాటు అనేక మంది ప్రతినిధులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించింది నివాళులర్పించారు. జియా కుమారుడు తారిక్ రెహమాన్‌ను కలిసి, పరామర్శించారు.

52 లక్షల ఎప్‌స్టీన్ ఫైళ్ల సమీక్ష

వాషింగ్టన్: అమెరికాలో సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లను సమీక్షించడం కోసం అక్కడి న్యాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు 5.2 మిలియన్ (52 లక్షల) పేజీలను సమీక్షించే బాధ్యతను 400 మంది న్యాయవాదులకు అప్పగించబోతోంది. జాతీయ భద్రత, క్రిమినల్ కేసుల ప్రాసిక్యూటర్లతో పాటు న్యూయార్క్, ఫ్లోరిడాలోని అటార్నీల కార్యాలయాల్లో పనిచేసే న్యాయవాదులకు ఈ పని అప్పజెప్పనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

నవంబరు నెలాఖరు నుంచి 200 మంది న్యాయవాదులకు ఈ పత్రాల సమీక్ష బాధ్యతలను న్యాయ శాఖ అప్పగించింది. ఇప్పుడు ఈ పని కోసం మరింత మంది అవసమని తమ ఉద్యోగులతో న్యాయ శాఖాధికారులు వెల్లడించారు. సమీక్ష ప్రక్రియ జనవరి 20వ తేదీ లోపు పూర్తి అయ్యే అంచనా ఉంది.

హాదీని చంపలేదు

హత్య కేసులో ప్రధాన నిందితుడి వీడియో వైరల్

దుబాయ్: బంగ్లాదేశ్ యువ నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యలో తన పాత్ర లేదని ఆ కేసులో ప్రధాన నిందితుడు ఫైజల్ కరీం మసూద్ వెల్లడించారు. తాను దుబాయ్‌లో ఉన్నట్లు ఓ వీడియో సందేశం ద్వారా తెలిపారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. హాదీ హత్యకు బాధ్యత బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీదేనని యూఏఈ వాదిస్తోంది. మసూద్ తన వీడియోలో 'నేను హాదీని హత్య చేయలేదు. నాకు, నా కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. చేయని నేరానికి మమల్ని బలిపశువులు చేయొద్దు. ప్రాణాలు కాపాడుకోవడం కోసం దుబాయ్ వచ్చాను. హాదీ జమాత్‌కు చెందిన వారు. ఆయన హత్య వెనుక జమాతీలు ఉండొచ్చు. హాదీతో నాది కేవలం వ్యాపార బంధం' అని మసూద్ వెల్లడించారు. ప్రభుత్వ కాంట్రాక్టులకు బదులుగా హాదీకి రాజకీయపరంగా విరాళాలిచ్చాను తప్ప మరెలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల కోసం కాదని ఆయన వివరణ ఇచ్చారు. కాగా, డిసెంబరు 12న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో గుర్తుతెలియని వ్యక్తులు హాదీపై కాల్పులు జరపగా, ఆయన సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశాస విడిచారు. హాదీ హత్య కేసులో నిందితులు భారత్‌లో ఆశ్రయం పొందినట్లు ఢాకా పోలీసుల వాదనను భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తోసిపుచ్చింది. నిరాధార ఆరోపణలు చేయొద్దని సూచించింది.

యువ దర్శకుడి పాత్రలో ఏఆర్ రెహమాన్

హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ వెండితెరపై నటుడిగా ఆరంగేట్రం చేస్తున్నారు. ప్రభుదేవా ప్రధాన పాత్రలో మనోజ్ ఎన్.ఎస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మూన్‌వాక్' చిత్రంలో రెహమాన్ నటించనున్నారు. బిహైండ్‌వుడ్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన క్యారెక్టర్ పోస్టర్లు తాజాగా విడుదలయ్యాయి. ఈ చిత్రంలో రెహమాన్ సంగీత దర్శకుడిగా కాకుండా, ఒక కల్పిత పాత్రలో కనిపించనున్నారు. ఆయన ఇందులో ఓ 'కోపమున్న యువ దర్శకుడి' పాత్రను పోషిస్తున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. అంతేకాకుండా, తన కెరీర్లో తొలిసారిగా ఈ సినిమాలోని మొత్తం ఐదు పాటలను ఆయనే స్వయంగా పాడటం మరో విశేషం. ఈ సందర్భంగా దర్శకుడు మనోజ్ ఎన్.ఎస్ మాట్లాడుతూ.. ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్‌లతో కలిసి 'మయిలే' అనే పాటను షూట్ చేయడం అద్భుతమైన అనుభవమన్నారు. ఈ పాటలో రెహమాన్ సార్ కనిపిస్తారని చెబుతూ... ఆ తర్వాత నేను చెప్పిన కథ నచ్చడంతో ఆయన సినిమాలో ఒక పూర్తి స్థాయి సన్నివేశంలో నటించడానికి ఒప్పుకున్నారని వెల్లడించారు. ఇక ఈ చిత్రంలో ప్రభుదేవా 'బాబుట్టి' అనే యువ కొరియోగ్రాఫర్ పాత్రలో నటిస్తుండగా, ప్రముఖ కమెడియన్ యోగి బాబు ఏకంగా మూడు విభిన్న పాత్రల్లో (కవరిమాన్ నారాయణన్, ఆట్టుక్కాల్ అళగు రాజా, దుబాయ్ మాథ్యూ) కనిపించనున్నారు. వీరితో పాటు అర్జున్ అశోక్, అజు వర్గీస్, రెడిన్ కింగ్స్ లే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని 2026 మే నెలలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.

కివీస్‌తో వన్డే సిరీస్...

శ్రేయస్ ఆడేనా?

న్యూఢిల్లీ: భారత-న్యూజిలాండ్ క్రికెట్ జట్ల మధ్య జనవరి 11 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ దూరం కాబోతున్నాడు. ఈ సిరీస్‌లో ఆడేందుకు అయ్యర్‌కు ఇప్పటివరకు బీసీసీఐ నుంచి క్లియరెన్స్ లభించలేదని సమాచారం. గాయం నుంచి కోలుకుంటున్న శ్రేయస్ బ్యాటింగ్ చేయగలిగినా... మైదానంలో ఫీల్డింగ్ చేసేంత శారీరక బలం ఇంకా రాలేదని వైద్య వర్గాలు వెల్లడించాయి. గత అక్టోబర్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో అలెక్స్ క్యారీ క్యాచ్ పట్టేందుకు డైవ్ చేసిన శ్రేయస్ అయ్యర్‌కు తీవ్రమైన గాయం అయ్యింది. ఆ తర్వాత సిడ్నీలో చేసిన స్కాన్లలో అంతర్గత రక్తస్రావం ఉన్నట్లు గుర్తించగా.. ఆయనను వెంటనే ఆస్పత్రిలో చేర్చి ఐసీయూలో చికిత్స అందించారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు స్వల్ప శస్త్రచికిత్స కూడా చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం గాయం కారణంగా శ్రేయస్ అయ్యర్ దాదాపు 6 కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కండరాల బలం తగ్గిపోవడం ఆయన రికవరీలో కీలక సమస్యగా మారిందని సమాచారం. అయితే శ్రేయస్ రికవరీ ప్రణాళిక ప్రకారం సాగితే... జనవరి 3, 6 తేదీల్లో ముంబై తరఫున విజయ్ హజారే ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశముందని మొదట వార్తలు వచ్చాయి. ఆ తర్వాత భారత జట్టుతో కలిసి వడోదరలో చేరతారని భావించారు. అయితే ఇది పూర్తిగా శ్రేయస్ శారీరక స్థితిపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ విషయంలో బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం... శ్రేయస్ అయ్యర్ ఈ వారం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం మంచి ఫిట్‌నెస్‌లో ఉన్నాడు. కానీ 50 ఓవర్ల మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేసే సామర్థ్యాన్ని ముందుగా అంచనా వేయాలి. దానిపైనే విజయ్ హజారే ట్రోఫీతో పాటు వన్డే సిరీస్‌లో ఆయన పాల్గొనడం ఆధారపడి ఉంటుందని తెలిపాయి. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్‌ను భారత, ఆస్ట్రేలియా వైద్య నిపుణులు కలిసి పర్యవేక్షిస్తున్నారు. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే ఆయనను మైదానంలోకి దించే ఆలోచనలో బీసీసీఐ ఉంది.

ప్రభాస్ నిజమైన 'డార్లింగ్'

బాలీవుడ్ నటి జరీనా వహబ్

హైదరాబాద్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ది రాజా సాబ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు భారీగా పెరిగిపోతున్నాయి. రొమాంటిక్ హారర్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం 2026 సంక్రాంతికి విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సినిమాలో ప్రభాస్ నానమ్మ గా నటిస్తున్న బాలీవుడ్ సీనియర్ నటి జరీనా వహబ్, ప్రభాస్ వ్యక్తిత్వం పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'ప్రభాస్ షూటింగ్ సెట్‌లో ఉంటే క్యారవాన్‌కు వెళ్లడానికి కూడా ఇష్టపడరు. తన సీన్ లేకపోయినా అందరితో ముచ్చటిస్తూ సెట్‌లోనే గడుపుతారు. ఆయనలో ఎలాంటి ఈగో, ఆటిట్యూడ్ కనిపించవు' అని జరీనా వహబ్ తెలిపారు. ముఖ్యంగా ప్రభాస్ పంపే భోజనం గురించి చెబుతూ.. ఆయన ఒక్కడికే కాదు, సెట్‌లో ఉన్న అందరికీ ఇంటి నుంచి భోజనం వచ్చేలా చూసుకుంటారు, అందుకే ఆయన నిజమైన 'డార్లింగ్' అని ప్రశంసించారు. అంతే కాదు సౌత్ ఇండియాలో హీరోలకు ఉన్న సంస్కారం, గౌరవం నార్త్ ఇండియాలో కనిపించవని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభాస్ మంచితనాన్ని చూసి, వచ్చే జన్మలో నాకు ఆయన లాంటి కొడుకే పుట్టాలని దేవుని కోరుతున్నా' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రభాస్ అభిమానుల మనసు గెలుచుకుంటున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్'తో పాటు 'స్పిరిట్', 'సలార్ 2' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

టాక్సిక్...గంగ పాత్రలో నయనతార

హైదరాబాద్: కేజీయఫ్ స్టార్ యశ్ హీరోగా, మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుండి లేడీ సూపర్ స్టార్ నయనతార ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇందులో ఆమె 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. కానీ ఆ పేరుకు ఏమాత్రం మోడ్రన్ డ్రెస్ ధరించి, చేతిలో గన్ పట్టుకుని సీరియస్ లుక్స్‌తో ఉన్న నయనతార పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు ఉండబోతున్నారనే ప్రచారాన్ని నిజం చేస్తూ మేకర్స్ వరుసగా అప్‌డేట్స్ ఇస్తున్నారు. నయనతారతో పాటు కియారా అద్వానీ 'నదియా' పాత్రలో, హ్యూమా ఖురేషీ 'ఎలిజబెత్' పాత్రలో నటిస్తున్నట్లు టీమ్ ప్రకటించింది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో కనిపిస్తుండటంతో సినిమా రేంజ్ మరింత పెరిగింది. యశ్ తన 19వ చిత్రంగా నటిస్తున్న ఈ సినిమా పెద్దలకు సందేశమిచ్చేలా ఉంటుందని సమాచారం. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

భారీస్థాయిలో ఎంఎస్‌వీపీ ప్రమోషన్స్!

హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన మన శంకర వర ప్రసాద్ గారు (ఎంఎస్‌వీపీ) సినిమా.. జనవరి 12న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి ఆదరణ లభించగా... చిరంజీవిని అత్యంత స్టైలిష్‌గా చూపిస్తూ అనిల్ రావిపూడి కట్ చేసిన ప్రోమోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. అలాగే.. సినిమాపై అంచనాలు పెంచడంలో పాటలు కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా చిరంజీవి-నయనతార జోడీ పాటలు ఆకట్టుకోగా, తాజాగా విడుదలైన 'మెగా విక్టరీ మాస్ సాంగ్' అభిమానుల్లో జోష్ నింపింది. ఇందులో మెగాస్టార్‌తో కలిసి విక్టరీ వెంకటేష్ స్టెప్పులేయడం థియేటర్లలో స్టెప్పులేసేలా ఉందని అభిమానులంటున్నారు. అనిల్ రావిపూడికి సంక్రాంతి సీజన్‌లో మంచి సక్సెస్ రేట్ ఉండటం, దానికి మెగాస్టార్ క్రేజ్ తోడవ్వడంతో ఈ సినిమా రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. మరోవైపు.. అమెరికాలో 15 రోజుల ముందే ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. అలాగే.. భారీ ఎత్తున ప్రమోషన్స్ చేయడానికి రెడీ అవుతోంది చిత్ర యూనిట్. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లో రెండు పెద్ద ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. ఏపీలో తూర్పు గోదావరిలో ఒక ఈవెంట్ నిర్వహించబోతున్నట్టుగా తెలుస్తోంది. ఈ ఈవెంట్‌కు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇక హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. జనవరి 12న సినిమా రిలీజ్ కానుండగా.. జనవరి 7న ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, ఈవెంట్ విషయంలో మేకర్స్ సైడ్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

మా దృష్టంతా టీ20 ప్రపంచకప్‌పైనే

దీప్తి శర్మ

తిరువనంతపురం: టీ20 ప్రపంచకప్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు టీమిండియా బౌలర్ దీప్తి శర్మ స్పష్టం చేశారు. వన్డే వరల్డ్‌కప్ 2025ను కైవసం చేసుకుని ఊపుమీదున్న భారత మహిళా క్రికెట్ జట్టు తాజాగా శ్రీలంకతో జరిగిన 5మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఇరుజట్లు తిరువనంతపురం వేదికగా భారత మహిళల జట్టు, శ్రీలంక మంగళవారం చివరి టీ20లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమిండియా 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. అలాగే 5-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ అనంతరం టీమిండియా బౌలర్ దీప్తి శర్మ మాట్లాడుతూ పొట్టి ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉందని, ఇప్పుడే దాని గురించి ఆలోచించలేమన్నారు. అయితే టీ20 వరల్డ్ కప్ సాధించడమే తమ అందరి లక్ష్యమని తెలిపారు. 'నేను ఎప్పుడూ జట్టు విజయం కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. 5-0 తేడాతో టీమ్‌ఇండియా సిరీస్ గెలవడంలో జట్టులోని అందరి పాత్ర ఉంది. ఇది సమష్టిగానే సాధ్యమైంది. వన్డే వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత అదే ఉత్సాహంతో టీ20 సిరీస్ గెలవడం ఆనందంగా ఉంది. టీ20 వరల్డ్ కప్‌నకు చాలా సమయం ఉంది. ఇప్పుడే దాని గురించి ఆలోచించలేదు. అయితే మా అందరి అంతిమ లక్ష్యం మాత్రం వరల్డ్ కప్ సాధించడమే. దీన్ని మేం మ్యాచ్ నుంచి మ్యాచ్‌కు, సిరీస్ నుంచి సిరీస్‌కు కొనసాగిస్తున్నాం. మాకు వేర్వేరు మ్యాచ్ విన్నర్లున్నారు. అది జట్టుకు ఎంతో మంచిది' అని దీప్తి శర్మ పేర్కొన్నారు. తిరువనంతపురం మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మొదట తడబడింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ (5), కమలిని (12) నిరాశపర్చగా రిచాఘోష్ (5), దీప్తి శర్మ (7), అమన్‌జోత్ కౌర్ పెద్దగా స్కోర్లు చేయలేకపోయారు. ఒకదశలో టీమిండియా కేవలం 77 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో (68-43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకుంది. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.

టీ20 ప్రపంచకప్

అఫ్ఘాన్ జట్టులో సీనియర్లకు చోటు

కాబూల్: ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ భారత్, శ్రీలంక వేదికలుగా 2026 ఫిబ్రవరిలో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీ కోసం అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) 15 మంది సభ్యులతో కూడిన తమ జట్టును ప్రకటించింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఈ జట్టుకు నాయకత్వం వహించనుండగా... అనుభవజ్ఞులైన ఆటగాళ్లను ప్రపంచకప్‌కు ఎంపిక చేశారు. ప్రధానంగా సీనియర్ ఆల్ రౌండర్ గుల్బాదిన్ నైబ్ తిరిగి జట్టులో స్థానం సంపాదించుకోగా, భుజం గాయం కారణంగా కొంతకాలం ఆటకు దూరంగా ఉన్న ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ పూర్తిగా కోలుకుని జట్టులోకి వచ్చాడు. స్పిన్ విభాగంలో ముజీబ్ ఉర్ రెహ్మాన్ తిరిగి రావడంతో ఇటీవల ఆకట్టుకున్న యువ స్పిన్నర్ ఏఎం ఘజన్‌ఫర్‌ను రిజర్వ్ జాబితాలో చేర్చాల్సి వచ్చింది.

నెలకు రూ.40 వేల జీతం... కార్మిక రక్షణ కోరుతూ

గిగ్ కార్మికుల దేశ వ్యాప్త సమ్మె

న్యూదిల్లీ/బెంగళూరు: ప్రస్తుత కమిషన్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ స్థానంలో నెలకు రూ.40 వేలు కనీస జీతం, కార్యాలయాల్లో సెలవు, ప్రాథమిక సౌకర్యాలను డిమాండ్ చేస్తూ గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు బుధవారం సమ్మె చేపట్టారు. గిగ్, ప్లాట్‌ఫామ్ సర్వీసెస్ వర్కర్స్ యూనియన్ (జీఐపీఎస్‌డబ్ల్యుయూ) దాని సభ్యులను వారు అనుబంధించబడిన వేదికల నుంచి అసైన్‌మెంట్‌లను పొందే యాప్‌లను ఆపరేట్ చేయవద్దని కోరింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి నిర్మల్ గోరానా మాట్లాడుతూ గిగ్ కార్మికులు కనీస వేతనం, ఆరోగ్యకరమైన పని పరిస్థితులు, సామాజిక భద్రత వంటి ప్రధాన కార్మిక హక్కుల నుంచి వ్యవస్థాగత మినహాయింపును ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదనంగా ఈ కార్మికులు జరిమానాలను ఎదుర్కొంటారు... అలాగే కస్టమర్ల ఇళ్లకు చేరుకోవడంలో జాప్యం కారణంగా తరచుగా పని నిరాకరించబడతారని తెలిపారు. చాలా మంది కస్టమర్లు గిగ్ కార్మికులతో ప్రవర్తిస్తారని గోరానా అన్నారు. 'ఈ సమ్మె గిగ్ కార్మికులను, మిత్రులను ఏకం చేసి తక్షణ ప్రభుత్వ జోక్యాన్ని డిమాండ్ చేస్తుంది. మా సంస్థతో సంబంధం ఉన్న కార్మికులను రేపు పని చేయవద్దని మేము అభ్యర్థించాము. వారి సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని మేము కోరాము' అని ఆయన తెలిపారు. అనేక ప్లాట్‌ఫామ్‌లు 10 నుంచి 20 నిమిషాల్లోపు వస్తువులను డెలివరీ చేసే పద్ధతిని ప్రారంభించాయని, డెలివరీ ఏజెంట్లకు ఇది తరచుగా సాధ్యం కాదని అన్నారు. సమయానికి చేరుకోలేకపోతే, ప్లాట్‌ఫామ్‌లు కార్మికుల ఐడీలను బ్లాక్ చేస్తాయని, తాత్కాలికంగా వారికి తదుపరి నియామకాన్ని నిరాకరిస్తాయని, ఈ గడువు విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'గిగ్, ప్లాట్‌ఫామ్ రంగంలో నిమగ్నమైన వ్యక్తులను ఉద్యోగులు లేదా కార్మికులుగా పరిగణించరు. అందువల్ల వారికి రోజుకు ఎనిమిది గంటల పని, ఓవర్ టైం, బీమా, సెలవు, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి కార్మిక చట్టాల నిబంధనలలో ఏవీ లభించవు. గిడ్డంగుల వంటి చాలా పని ప్రదేశాలలో కూడా రెస్ట్ రూమ్, మెడికల్ రూమ్ వంటి అనేక సౌకర్యాలు లేవు' అని ఆయన తెలిపారు. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, డిమాండ్ ఎప్పుడూ లేనంత ఎక్కువగా ఉన్నప్పుడు, నూతన సంవత్సర పండుగ సందర్భంగా జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థల కార్యకలాపాలను సమ్మె ప్రభావితం చేయవచ్చు.

ప్రోత్సాహకాలు అందించేందుకు సిద్ధం

నూతన సంవత్సరం వేళ గిగ్ కార్మికుల సమ్మె పిలుపు మధ్య ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు జొమాటో, స్విగ్గీ తమ డెలివరీ భాగస్వాములకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పండుగ సమయాల్లో వారు అనుసరించే ప్రామాణిక పద్ధతి, నూతన సంవత్సర పండుగ సందర్భంగా సేవలలో అంతరాయాలు తక్కువగా ఉండేలా చూసుకోవడానికి చర్యలు చేపట్టాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 12 గంటల మధ్య పీక్ అవర్స్ సమయంలో జొమాటో డెలివరీ భాగస్వాములకు ఆర్డర్‌కు రూ.120 నుంచి రూ.150 వరకు పేఅవుట్‌లను అందించింది. ఆర్డర్ విలువలు, కార్మికుల లభ్యతను అనుసరించి... రోజంతా రూ.3 వేల వరకు ఆదాయాన్ని పొందుతామని ప్లాట్‌ఫామ్ హామీ ఇచ్చిందని సంబంధిత వ్యక్తులు తెలిపారు. అలాగే అదనంగా ఆర్డర్ తిరస్కరణలు, రద్దులపై జొమాటో తాత్కాలికంగా జరిమానాలను మాఫీ చేసిందని, అయితే, ఇది అధిక డిమాండ్ ఉన్న పండుగ, సంవత్సరాంతపు కాలాల్లో అనుసరించే ప్రామాణిక నిర్వహణా ప్రోటోకాల్ అని వారు నొక్కి చెప్పారు. స్విగ్గీ డిసెంబరు 31, జనవరి 1 వరకు డెలివరీ కార్మికులకు రూ.10 వేల వరకు ఆదాయాన్ని అందిస్తుందని వారు అన్నారు.

గిగ్ కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలి: గెహ్లోత్

జైపూర్: రాజస్థాన్ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, వెల్ఫేర్) చట్టం-2023 ను వెంటనే అమలు చేయాలని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉదాసీనత కారణంగా గిగ్ కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందని ఆరోపించారు. రోజువారీ ఆదాయంపై ఆధారపడిన డెలివరీ భాగస్వాములతో సహా గిగ్ కార్మికులు నూతన సంవత్సర కాలం ఆర్డర్‌లకు గరిష్ట సమయం అయినప్పటికీ నిరసన తెలియజేయాల్సి వచ్చిందని గెహ్లోత్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా జరిగిన సంభాషణలను ప్రస్తావిస్తూ, గిగ్ కార్మికులు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో తమ ఆందోళనలను పంచుకున్నారని, ఆ తర్వాత గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాట్‌ఫామ్ ఆధారిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి దేశంలోనే మొట్టమొదటి చట్టాన్ని రూపొందించిందని గెహ్లోత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నియమాలను రూపొందించి, చట్టాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీరామ్‌జీ నల్లచట్టం వెనక్కి తీసుకోవాలి

షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీబీ జీ రామ్‌జీ చట్టం ఒక నల్ల చట్టమని, అది పేదల పొట్టకొట్టే చట్టమని, తక్షణమే దీన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం షర్మిల ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ((ఎంజీఎన్ఆర్ఈజీఏ) కు రాష్ట్రంలోనే బీజం పడిందని ఆమె గుర్తుచేశారు. పనికి ఆహార పథకం అమలులో అప్పుడు వైఎస్ఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, కరువు పని విజయవంతంతో నాడు ఏపీ రోల్ మోడల్‌గా ఉందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్ర గ్రామీణ ప్రాంత అభివృద్ధికి, బతుకు జీవనాన్ని గ్యారెంటీ చేయడానికి, వలసలు నివారించి పేదల కొనుగోలు శక్తి పెంచడానికి, వ్యవసాయానికి సాయంగాను నాడు వైఎస్ఆర్ హయంలో తోడ్పడిందని చెప్పారు. 2006 నుంచి నేటి వరకు 20 ఏళ్లలో రాష్ట్రానికి లక్ష కోట్లు వచ్చాయంటే, ఏడాదికి కోటి మందికి ప్రత్యక్షంగా పని గ్యారెంటీ అయ్యిందంటే కాంగ్రెస్ తెచ్చిన నరేగా చట్టం పుణ్యమేనని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచిన దేశ ద్రోహి ప్రధాని మోదీ అని, పట్టెడన్నం పెట్టే కరువు పనిపై కుట్రలు చేశారని, చట్టాన్ని మార్చి ఉపాధి హామీలో ఊపిరి తీశారన్నారు. మోదీ తెచ్చిన కొత్త చట్టం ఉపాధి హామీలో ఉపాధి లేనట్లేనని విమర్శించారు. వీబీ జీ రామ్‌జీ అనేది... ఉపాధిని హక్కుగా తీసేసి కేంద్రమే దిక్కుగా మార్చిన అక్రమ చట్టమని, రాష్ట్రాల మీద ఆర్థిక భారం మోపి, గ్రామ స్వరాజ్యం వినాశనమే ధ్యేయంగా మోదీ నీచపు పాలన చేస్తున్నారని తెలిపారు. ఆ చట్టంలో పనులు గ్రామ సభ కాకుండా దిల్లీ సభ నిర్ణయిస్తుందని చెప్పడం తగదన్నారు. ఇదెక్కడి న్యాయం?, ఇదేం చట్టం? అన్ని గ్రామాల్లో కాకుండా ఎంపిక చేసిన ప్రాంతాల్లో పని కల్పిస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. ఒకరికి అన్నం పెట్టి మరొకరికి సున్నం పెడతారా?, ఏడాదికి 60 రోజులు పని బంద్ పెట్టడం ఇదేం నియంత చట్టం? అని మండిపడ్డారు. రాష్ట్రాలు 40 శాతం నిధులు ఇవ్వకపోతే ఉపాధి ఎలా దక్కుతుంది?, కేంద్రం ఇచ్చే నిధుల ఆధారంగా పనులు పరిమితం చేయడమంటే ప్రజలను పరిమితం చేస్తున్నట్లు కాదా? అని నిలదీశారు. గ్రామ ఆస్తుల్లో కాకుండా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం అంటే... కార్పొరేట్ వ్యవస్థలను పోషిస్తున్నట్లు అవ్వదా అని ప్రశ్నించారు. వీబీ జీ రామ్ జీ అక్రమ చట్టాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలను కలుపుకుని అన్ని జిల్లాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని షర్మిల హెచ్చరించారు.

ప్రియాంకాగాంధీ ర్యాలీలో కోడలు అవివా బేగ్!

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ ఇంట్లో త్వరలో వివాహ వేడుక జరగనుంది. కుమారుడు రైహాన్ వాద్రాకు ఇటీవల స్నేహితురాలు అవివా బేగ్‌తో నిశ్చితార్థం జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయి. అధికారికంగా రెండు కుటుంబాలు ప్రకటించక పోయినా... రైహాన్ వాద్రా-అవివా బేగ్‌కు నిశ్చితార్థం జరిగిపోయినట్లుగా నివేదికలు అందుతున్నాయి. వచ్చే ఏడాది ప్రారంభంలోనే వివాహం జరగనుందని, ఇందుకోసం ఏర్పాట్లు కూడా జరుగుతున్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా అవివా బేగ్‌కు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గత ఏడాది వయనాడ్‌లో జరిగిన ఉపఎన్నికల్లో ప్రియాంకాగాంధీ పోటీ చేశారు. ఆ సందర్భంగా జరిగిన ఎన్నికల ర్యాలీలో కాబోయే కోడలు అవివా బేగ్ కూడా ఉన్నారు. రైహాన్ వాద్రా పక్కన నిలబడిన అవివా బేగ్ చాలా ఉల్లాసంగా... ఉత్సాహంగా నవ్వుతూ కనిపించింది. కాగా దిల్లీలో నివసించే అవివా బేగ్‌కు మీడియా, డిజైన్, ఫొటోగ్రఫీలో నైపుణ్యం ఉంది. రైహాన్ వాద్రాకూ అవే ఇష్టం. దీంతో ఇద్దరి ఇష్టాలు ఒకటి కావడంతో 7 ఏళ్ల నుంచి స్నేహం చేస్తున్నారు. ఇటీవల రైహాన్ వాద్రా పెళ్లి ప్రతిపాదన చేయగానే వెంటనే ఓకే చెప్పినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు అవివా బేగ్ తల్లి నందితా బేగ్-ప్రియాంకాగాంధీ కూడా చాలా ఏళ్ల నుంచి మంచి స్నేహితురాళ్లుగా కూడా తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్ ఇంటీరియర్ డిజైన్‌ను నిందితా బేగ్‌నే చేసినట్లుగా సమాచారం. ఇలా రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. అదే రైహాన్ వాద్రా-అవివా బేగ్ బంధానికి పునాదులు పడినట్లుగా తెలుస్తోంది. రైహాన్ వాద్రా దృశ్య కళాకారుడు, వైల్డ్ లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో గుర్తింపు తెచ్చుకున్నాడు. పదేళ్ల వయసులోనే కెమెరా చేతపట్టాడు. తాత, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ కూడా ఫొటోగ్రఫీని ఇష్టపడేవారు. దానిపైనే ఎక్కువ మక్కువ చూపించడంతో తల్లి ప్రియాంకాగాంధీ ఎంతగానో ప్రోత్సహించింది. 2021 లో దిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'డార్క్ పర్సెప్షన్' పేరుతో తొలి ఎగ్జిబిషన్ నిర్వహించాడు. అవీవా బేగ్ కూడా ఫొటోగ్రాఫర్, ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇద్దరికీ ఒకే రుచి ఉండడంతో మనసులు కలిశాయి.

లక్షల మందిని మింగేసిన

కరోనాకు ఆరేళ్లు

న్యూదిల్లీ: కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని చుట్టిముట్టి ఆరేళ్లు పూర్తయింది. డిసెంబరు 31, 2019 ప్రపంచమంతా నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమవుతోంది. ప్రజలంతా కొత్త ఏడాదిని స్వాగతించేందుకు ఎదురు చూస్తున్న సమయంలో కోవిడ్ మహమ్మారి పురుడుపోసుకుంది. ఆధునిక కాలంలో మున్నెడూ చూడని విధంగా ప్రజలందరినీ కేవలం ఇళ్లకే పరిమితం చేసింది. 'లాక్‌డౌన్' తో జనజీవితం అస్తవ్యస్తమైంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది కరోనా మహమ్మారికి బలయ్యారు. ఈ మహమ్మారి కరోనాకు చైనాలోని వూహాన్ నగరం కేంద్రంగా మారింది. చైనాలోని ఆరోగ్య నిపుణులు కొత్తగా నమోదయిన కేసును మొదటగా 'న్యూమోనియా' గా భావించారు. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, లక్షణాల తీవ్రంగా ఉండటంతో అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. ఇది నెమ్మదిగా చైనా నుంచి ప్రపంచంలోని మిగతా దేశాలకు వ్యాపించింది. అనేక దేశాల ఆర్థిక, ఆరోగ్య వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది. వూహాన్‌లోని చేపల మార్కెట్‌లో మొదటగా ఈ కరోనా కేసులను గుర్తించారు. అటుతర్వాత ఇది యూరప్, అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని ఇతర దేశాలకు చేరింది. 21వ శతాబ్దపు అత్యంత వినాశకరమైన మహమ్మారిగా మారింది. మార్చి 2020 నాటికి వేగంగా వ్యాప్తి చెందుతున్న వైరస్‌ను అరికట్టడానికి దేశాలు తమ సరిహద్దులను మూసేశాయి. నగరాలు స్మశానాలను తలపించేలా 'లాక్‌డౌన్' పరిస్థితిలోకి వెళ్లాయి. అధికారికంగా కోవిడ్-19 వల్ల ప్రపంచ వ్యాప్తంగా 7 మిలియన్ల మంది ప్రాణాలు వదిలారు. మహా మాంద్యం తర్వాత ఎప్పుడూ చూడని విధంగా అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యాయి. కోవిడ్-19ను అరికట్టడానికి భారత్ మార్చి 2020 లో దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ముందుగానే వినాశనాన్ని గుర్తించిన కేంద్రం... ఆస్పత్రులు, పరీక్షలు, ఆక్సిజన్ సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి సమయాన్ని సంపాదించుకుంది. కానీ కోవిడ్-19 డెల్టా వేరియంట్ వారాల్లోనే లక్షలాది మందిని చంపింది. అయినప్పటికీ, భారత్ ఒక ఏడాది లోపే వ్యాక్సిన్‌ను తయారు చేసుకోగలిగింది. భారత్ బయోటెక్ కోవాక్సిన్, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కోవిషీల్డ్‌ను భారీగా ఉత్పత్తి చేసింది. లక్షలాది మంది మరణాలను అడ్డుకునేందుకు సహాయపడ్డాయి. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆరేళ్ల క్రితం వూహాన్ నుంచి వచ్చిన ఈ కరోనా వైరస్, ప్రపంచ దేశాలకు ఆరోగ్య అత్యవసర స్థితికి ఎలా సన్నద్ధమవ్వాలో నేర్పింది.

పుతిన్ నివాసంపై దాడి వీడియో దృశ్యాలు

మాస్కో: ఉక్రెయిన్‌తో ఘర్షణలను ముగించే దిశగా ప్రయత్నాలు జరుగుతోన్న వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడి జరిగింది. 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని రష్యా విదేశాంగ వెల్లడించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆ దృశ్యాలు విడుదలయ్యాయి. రష్యా రక్షణశాఖ వాటిని బయటపెట్టింది. ఈ వీడియో ప్రారంభంలో కూలిన డ్రోన్ ఒకటి కనిపిస్తోంది. నోవ్‌గొరాడ్ ప్రాంతంలో పుతిన్ వ్యక్తిగత నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా వెల్లడించింది దీనిని ఉగ్రదాడిగా పేర్కొంది. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లు అన్నింటినీ నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎటువంటి నష్టం కలగలేదని పేర్కొంది. ఉక్రెయిన్‌పై సరైన సమయంలో దాడిచేసే హక్కు తమకు ఉందని, శాంతి చర్చలకు విఘాతం కలిగించే దాడి అని విదేశాంగశాఖ మంత్రి లవ్రోవ్ హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ఖండించింది. ఇదంతా అవాస్తవమని పేర్కొంది.

కులం, డబ్బు, భాష ప్రామాణికం కారాదు

మోహన్ భగవత్



రాయ్‌పూర్: 'ఇది అందరి దేశం. అందరూ సమానులే. కులం, సంపద లేక భాష ఆధారంగా వ్యక్తులను అంచనా వేయరాదు. సామాజిక ఐక్యతను ప్రోత్సహించాలి' అని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. వేర్పాటువాద, వివక్షపూరిత ఆలోచనలను విడనాడటమే సామరస్యానికి తొలి అడుగన్నారు. చత్తీస్‌గఢ్, రాయ్‌పూర్ జిల్లాలోని సోన్‌పైరి గ్రామంలో జరిగిన హిందూ సమ్మేళనంలో భగవత్ బుధవారం ప్రసంగించారు. 'దేశం అందరిది... ఎవరి విశ్వాసాలు వారివి. కులం, ధనం లేక భాషను బట్టి ఎవరినీ అంచనా వేయడం సరికాదు. అదే నిజమైన సామాజిక సామరస్యానికి స్ఫూర్తి' అని అన్నారు. కుటుంబ సంబంధాలు పెంపొందించుకోవాలని, వారం ఒక రోజు కుటుంబమంతా కలిసి భోజనం చేయాలని, ఎవరి విశ్వాసాల ప్రకారం వారు ప్రార్థన చేయాలని, అర్థవంతమైన చర్చలు జరపాలని భగవత్ సూచించారు. ఒంటరితనం చెడు అలవాటులకు, వ్యసనాలకు దారితీస్తుందని... కుటుంబ సభ్యులతో మమేకం కావడం వల్ల దురలవాట్లకు దూరంగా ఉండవచ్చని అన్నారు. సామాజిక సామరస్యత, పర్యావరణం పట్ల బాధ్యత, క్రమశిక్షణతో కూడిన జీవనంతోనే మెరుగైన భవిష్యత్‌కు హామీ లభిస్తుందన్నారు. విభజన ధోరణిని వీడినప్పుడే దేశం సామరస్యంగా-ఐక్యంగా వర్ధిల్లుతుందని భగవత్ వెల్లడించారు. హిందువులందరికీ ఆలయాల్లో ప్రవేశం ఉండాలని, జల వనరులు, శ్మశానాలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సౌకర్యాలు, ప్రార్థనాలయాలు అందరి కోసమన్నారు. దేశం ప్రమాదంలో ఉంటే కుటుంబాలు కూడా ప్రమాదమేనని హెచ్చరించారు. నీటిని ఆదా చేయాలని, వర్షపు నీటిని నిల్వ చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మొక్కలు నాటాలని, ఇళ్లలో మాతృభాషలోనే మాట్లాడాలని, సంప్రదాయ వస్త్రధారణను ప్రోత్సహించాలని, దేశీయ తయారీ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాలని, రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడాలని భగవత్ సూచించారు. రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధులు, పౌరుల బాధ్యతలను ప్రస్తావించారు. వీటి గురించి ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. పెద్దలను గౌరవించాలని, అవసరంలో ఉన్నవారికి సాయం చేయడం వంటి సామాజిక విలువలు పెంచుకోవాలని, సంప్రదాయాలు ఆచరించాలని భగవత్ సూచించారు.

మహిళల రక్షణ గాలికొదిలేసిన కూటమి

వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో క్యాలెండర్ ఇయర్ మారుతోంది కానీ కూటమి పాలనలో ప్రభుత్వం, నాయకుల క్యారెక్టర్‌లో మార్పు కనిపించడం లేదని వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. మహిళలకు ఆరు పథకాల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, వాటిని అమలు చేయకపోగా వారికి ఆర్తనాదాలు, అఘాయిత్యాలు, అబద్ధాలను మిగిల్చిందని తెలిపారు. ఆ బాధితులకు వైసీపీ ఎప్పుడూ అండగా నిలబడిందని, కొత్త సంవత్సరంలోనూ తమ పార్టీ మహిళలకు ఆ భరోసా ఇస్తుందన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 18 నెలల్లో ఐదు కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసి అమ్మకానికి పెట్టేసిన పరిస్థితి చూస్తున్నామని, నెలకో డ్రామా, రోజుకో అబద్ధం, గంటకో అరాచకం ఈ రాష్ట్రంలో జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ ఏడాది రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రక్షించాల్సిన పాలకులు ప్రజలను భక్షిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించాల్సిన పాలకులే దానికే తూట్లు పొడుస్తున్నారని, ఆటవికరాజ్యం మాదిరిగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2025 ఏడాదిని ఓ చీకటి సంవత్సరంగా కూటమి ప్రభుత్వం నిలిపిందని, ఎంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయంటే... మద్యం ఏరులై పారుతోందని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలు, నేరాలు విచ్చలవిడిగా పది జిల్లాల్లో పెరిగాయని కలెక్టర్ల సదస్సులో స్వయంగా సీఎం చంద్రబాబే చెప్పారన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిపోయిందని, సింహాచలం పుణ్యక్షేత్రంలో పులిహోర ప్రసాదంలో నత్త వచ్చిందని అడిగితే బాధితులపైనే నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారన్నారు. ప్రతి మహిళా ఉద్యోగికి నెలకు రూ.3 వేల చొప్పున ఇప్పటికే రూ.54 వేల నిరుద్యోగ భృతి బాకీ పడ్డారని, ఈ 18 నెలల్లో 2 కోట్ల మందికి రూ.27 వేల చొప్పున బకాయి పడ్డారని తెలిపారు. మహిళలకు అండగా వైసీపీ పోరాటం చేస్తుందని ఆమె అన్నారు.

అయోధ్య ఆలయంపై రాజ్‌నాథ్ పతాకావిష్కరణ

అయోధ్య: అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ ద్వాదశి కార్యక్రమంలో భాగంగా అన్నపూర్ణ ఆలయంపై కాషాయ పతాకాన్ని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఆవిష్కరించారు. ప్రాణ్ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవంలో రాజ్‌నాథ్ చీఫ్ 'యజమాన్'గా హాజరయ్యారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా రాజ్‌నాథ్ వెంట ఉన్నారు. దీనికి ముందు రాజ్‌నాథ్ సింగ్, యోగి ఆదిత్యనాథ్ కలిసి హనుమాన్‌గర్హి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం రామాలయంలోని రామ్‌లల్లాను దర్శించి పూజలు చేశారు. ఈ వారం ప్రారంభంలో మొదలైన ప్రాణప్రతిష్ఠ ద్వాదశి వేడుకలు శుక్రవారం వరకూ కొనసాగుతాయి. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ ప్రధాని మోదీ చేతుల మీదుగా 2024, జనవరి 22న జరిగింది. కోట్లాది మంది భక్తులు ఈ చారిత్రక ఘట్టాన్ని వీక్షించారు. రెండో వార్షికోత్సవం దగ్గరపడుతుండటంతో రామ్‌లల్లాను దర్శించుకునేందుకు సుమారు ఆరు లక్షల మంది భక్తులు అయోధ్యకు వస్తారని శ్రీరామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు అంచనా వేస్తోంది. వీవీఐపీ పర్యటనలను దృష్టిలో ఉంచుకుని అయోధ్యలో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. స్థానిక పోలీసులు వివిధ అంచెల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్యను ఐదు జోన్లు, 10 సెక్యూరిటీ సెక్టార్ల కింద విభజించినట్టు సిటీ ఎస్పీ సీపీ త్రిపాఠి తెలిపారు. ప్రతిచోటా నోడల్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామని, వారు తమతమ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. అయోధ్య వ్యాప్తంగా మూడువేల మంది పోలీసులతో భద్రతావలయం ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీలు, తొమ్మిది మంది సూపరింటెండెంట్లు, సుమారు 50 మంది ఇన్‌స్పెక్టర్లు, 150 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు, పెద్ద సంఖ్యలో కానిస్టేబుళ్లను మోహరించారు. అదనంగా ఐదు కంపెనీల పీఏసీ, పారామిలటరీ బలగాలను అయోధ్యలో అందుబాటులో ఉంచారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాను కట్టుదిట్టం చేశారు. కీలక ప్రాంతాల్లో యాంటీ-డ్రోన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేశారు.

ఒక్కరోజే 2,122 నామినేషన్లు

ముంబై: బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు మొత్తం 2,516 నామినేషన్‌లు వచ్చాయని అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 29 వరకు 400 నామినేషన్లు రాగా, నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన 30న అత్యధికంగా 2,122 నామినేషన్ పత్రాలు వచ్చాయని వివరించారు. 227 ఎలక్టోరల్ వార్డులు ఉన్న బీఎంసీకి జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మరుసటి రోజు ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈ నెల 23న ప్రారంభమై 30న ముగిసింది. మొత్తం 2,516 నామినేషన్లు దాఖలయ్యాయి. గోవండి, డియోనార్, చెంబూర్, ట్రాంబే, మాన్‌కుర్ద్, అనిక్ ప్రాంతాలను కలిగి ఉన్న ఎం-ఈస్ట్ వార్డ్‌లో అత్యధికంగా 183 నామినేషన్లు వచ్చాయని అన్నారు. ఈ నెల 30 వరకు మొత్తం 11,391 నామినేషన్ ఫారాలు (ఏ,బీ ఫారాలు) పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

శ్మశానవాటికలోనే నామినేషన్ పత్రాలు అందజేత

ఇదిలా ఉండగా... ఒక రాజకీయ పార్టీ నేత తల్లి మరణించడంతో అంత్యక్రియల కోసం శ్మశానవాటికలో ఉన్న ఆయనకు నామినేషన్ పత్రాలు అందజేసింది. ఈ సంఘటన మహారాష్ట్రలో జరిగింది. ఆ రాష్ట్రంలో 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పోటీ చేసే అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను చివరి నిమిషంలో ఖరారు చేసింది. అయితే ఆయన తల్లి మరణించడంతో మంగళవారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సాయంత్రం 3 గంటలకు నామినేషన్ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలుకు సంబంధించిన ఏబీ ఫారమ్‌ను పార్టీ నేతలతో శ్మశానవాటికకు పంపింది. అక్కడ తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యోగేష్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. దీంతో తల్లి అంత్యక్రియల అనంతరం ఆయన చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదో వార్డు అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను షిండే శివసేన పార్టీ నామినేట్ చేసింది.ఆయన కుమార్తె కృతికను కూడా ఎనిమిదో వార్డు నుంచి ఎన్నికల బరిలోకి దించింది.

హిజాబ్ వివాదం... విధుల్లో చేరని వైద్యురాలు

పట్నా: ఇటీవల బీహార్‌లో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఓ వైద్యురాలి హిజాబ్‌ను తొలగించడంపై వివాదం నెలకొనగా... ఆ ఘటనతో ఇబ్బందిపడిన వైద్యురాలు నుస్రత్ పర్వీన్ ఇంకా విధుల్లో చేరలేదని అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వైద్యులు పోస్టింగ్‌లో చేరడానికి ఇచ్చిన తుది గడువు బుధవారంతో ముగుస్తుందని.. సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధుల్లో చేరాల్సిన ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. రిపోర్టు చేయకపోతే ఆమె నియామకాన్ని రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. కాగా, హిజాబ్ వివాదం తర్వాత పర్వీన్ కుటుంబం పట్నా నుంచి కోల్‌కతాకు మారినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో నుస్రత్ పర్వీన్ అనే వైద్యురాలికి నితీశ్ ...ఆయుష్ సర్టిఫికెట్ అందజేశారు. సర్టిఫికెట్‌ను చేతికిచ్చిన ఆయన... డాక్టర్ ముఖంపై ఉన్న హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. సీఎం చర్యకు మహిళ స్పందించనప్పటికీ... నిశ్చేష్టురాలై ఉండిపోయింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో.. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు నితీశ్ చర్యను తీవ్రంగా ఖండించారు.

కార్మిక కోడ్‌లతో బానిసత్వమే

ఫిబ్రవరి సమ్మె జయప్రదం చేద్దాం

విశాఖ సదస్సులో అమర్‌జీత్ కౌర్

విశాలాంధ్ర-విశాఖ: కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టే విధంగా కొత్త లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేపట్టబోతున్నట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్త కోడ్‌లు అమల్లోకి రాకుండా అడ్డుకోకపోతే ఫిబ్రవరిలో జరగబోయేది చివరి సమ్మె అవుతుందని హెచ్చరించారు. అమర్‌జీత్ కౌర్ బుధవారం విశాఖలో ఏఐటీయూసీ జిల్లా సమితి సదస్సుకు హాజరయ్యారు. 'కార్మిక చట్టాలు, దేశ ఆర్థిక రంగంపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రభావం' అంశంపై ప్రసంగించారు. 11 కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని, కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు. ఈ సమ్మెపై జనవరి 9న కార్మిక సంఘాల సమావేశం జరగనుందని తెలిపారు. కార్మిక చట్టాలకు, లేబర్ కోడ్‌లకు వ్యత్యాసం ఉందని, చట్టాలు సవరించాలంటే పార్లమెంటు ఆమోదించాలని, కోడ్‌ల సవరణకు కేబినెట్ ఆమోదిస్తే సరిపోతుందని అమర్‌జీత్ కౌర్ అన్నారు. ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్‌షాతో చెప్పి తమకు వీలుగా కార్మిక కోడ్‌లను మార్చుకనేందుకు అదానీ, అంబానీలకు అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తంచేశారు. యూనియన్ల ఏర్పాటు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చాలా కష్టమవుతుందని, వేతన నిర్వచనం ఇప్పటికే మార్చేశారని, కార్మికుల భద్రతకు హామీలేదని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. ఫ్యాక్టరీల అధికారులకు ఎటువంటి అధికారాలూ ఉండవని, వారు ఫెసిలిటేటర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసినట్లేనని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అప్పటి ప్రధాని నెహ్రూ... దేశంలో ఫ్యాక్టరీల ఏర్పాటుకు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సహకారం కోరితే ఆ దేశాలు నిరాకరించాయని గుర్తుచేశారు. సీపీఐ సూచనతో సోవియట్ యూనియన్ సహకారాన్ని నెహ్రూ కోరారని, సోవియట్ యూనియన్ ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా పూర్తిగా సహకరించిందని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించగా, లాలా లజపత్ రాయ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారని, తరువాత కాలంలో నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, వీవీ గిరి, సరోజినీ నాయుడు ప్రధాన కార్యదర్శులయ్యారని తెలిపారు. 1921లో సంపూర్ణ స్వరాజ్యం కోసం ఏఐటీయూసీ పిలుపునిచ్చిందన్నారు. దేశంలో ఒప్పంద కార్మికులు పెరుగుతున్నారని, ఉద్యోగ భద్రత దెబ్బతింటోందని, అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేకుండా పోయిందని అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. ఏఐటీయూసి విశాఖ జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా అధ్యక్షుడు మన్మధరావు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బూసి వెంకటరావు, కోశాధికారి సత్యాంజనేయ, పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్ పాల్గొన్నారు.

నూతన వత్సరంలో నవ సంకల్పం

డి.రాజా పిలుపు



న్యూఢిల్లీ: దేశంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ దుష్పరిపాలన సాగుతోందని, దీని వల్ల అనేక సంక్షోభాల్లో భారత్ చిక్కుకుపోయిందని, ఇలాంటి సమయంలో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. నూతన సంవత్సరంలో నవ సంకల్పంతో ముందుకెళ్లాలని ఆయన బుధవారం సామాజిక మాధ్యమం వేదికగా పిలుపునిచ్చారు. ఐక్యంగా, దృఢంగా, ధైర్యంగా నిరంకుశత్వాన్ని ఎదిరించాలని... ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించాలని... న్యాయం, సమానత్వం, గౌరవం కోసం సమ్మిళిత పోరాటాలను మరింత బలంగా చేపట్టాలని డి.రాజా నొక్కిచెప్పారు. ఐక్య పోరాటాలతో ముందుకెళదామంటూ పిలుపునిచ్చారు. దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొందని... నిరుద్యోగం, వ్యవసాయ సమస్యలు వెంటాడుతున్నాయని అన్నారు. కార్మిక హక్కులపై దాడులు, సమాఖ్యవాదం తుడిచిపెట్టుకుపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామిక వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని, మతం పేరిట సమాజం విభజనకు గురవుతోందన్నారు. గణతంత్రానికి, రాజ్యాంగ విలువలకు పెద్ద ముప్పు ఏర్పడిందని రాజా పేర్కొన్నారు. ఈ సంక్షోభాలన్నింటిని అధిగమించేందుకుగాను నవ సంకల్పంతో నూతన సంవత్సరంలో పోరాటాలను మరింత ఉధృతంగా చేపట్టేందుకు ఏకమవుదామంటూ డి.రాజా పిలుపునిచ్చారు. అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ఫాదర్ అరెస్ట్ రాజ్యాంగ స్వేచ్ఛ హరించడమే

కేరళ సీఎం పినరయి విజయన్

కొట్టాయం: బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఫాదర్ అరెస్ట్ రాజ్యాంగ స్వేచ్ఛను హరించడమేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాదరర్ సుధీర్, ఆయన భార్యతో పాటు 10 మంది సహచరుల అరెస్ట్‌పై విజయన్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. వారి అరెస్ట్ తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఈ అరెస్ట్ మైనారిటీలు లక్ష్యంగా విభజనకు ఆజ్యం పోసేందుకు సంఘ్ పరివార్ అనుసరిస్తున్న ఆందోళనకరమైన విధానానికి చిహ్నమని, గతంలో జబల్‌పూర్‌లో ఇదే తరహా ఘటనను చూశామని అన్నారు. ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛను హరిస్తున్నాయని తెలిపారు. ఫాదర్ సుధీర్ గత ఐదేళ్లుగా మహారాష్ట్రలో ఉంటున్నారు. క్రిస్మస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఇతర మిషనరీలతో కలిసి స్థానికంగా ఒక నివాసానికి చేరుకున్నారు. ఆహ్వానించిన వ్యక్తి పుట్టినరోజు కూడా కావడంతో అక్కడ వేడుకలు జరుపుకుంటున్నారు. అయితే ఫాదర్ బలవంతపు మతమార్పిడులకు పాల్పడుతున్నారంటూ భజరంగ్ దళ్ కార్యకర్త ఫిర్యాదుతో నాగపూర్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు.

నిర్ణయాత్మక చర్యలకు ఇదే సమయం

ఆరావళికి పూర్తి రక్షణే పోరాటలక్ష్యం: ఏఐకేఎస్

న్యూఢిల్లీ: ఆరావళి పరిరక్షణకు అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సంకల్పించింది. కార్పొరేట్ల ప్రయోజనార్థం కోర్టు తీర్పునే వక్రీకరించేందుకు ప్రయత్నించిన మైనింగ్ మంత్రి రాజీనామాకు డిమాండ్ చేసింది. ఆరావళి పర్వత్రాలపై మైనింగ్‌ను పూర్తి నిషేధించాలని కోరింది. స్వతంత్ర దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్ల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామని, తమతో కలిసి రావాలని రైతులు, పౌరులు, పర్యావరణవేత్తలకు పిలుపునిచ్చింది. ప్రభావిత రాష్ట్రాల్లో ప్రజలను చైతన్యపర్చి, మైనింగ్ ప్రయోజనాలపై ఉక్కుపాదం మోపేలా ఒత్తిడి పెంచుదామంటూ ఒక ప్రకటనను ఏఐకేఎస్ అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య బుధవారం విడుదల చేశారు.ఆరావళికి శాశ్వత-సమగ్ర పరిరక్షణపై రాజీ ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. స్పష్టతలు... కమిటీల కాలం గడిచింది... నిర్ణయాత్మక చర్యలకు ఇదే సమయమని నొక్కిచెప్పారు. ప్రభుత్వం ఒత్తిళ్లకు తలొగ్గని ప్రతినిధులతో స్వతంత్ర కమిటీలో పర్యావరణవేత్తలు, భూగోళశాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులు, గిరిజన తెగల ముఖ్యలు మాత్రమే సభ్యులుగా ఉండాలని... బ్యూరోక్రాట్లు ప్రభుత్వ అనుబంధ నిపుణులు ఉండరాదని సూచించారు. కమిటీ చర్చలు, డేటా పూర్తి పారదర్శకంగా, ప్రజల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు. మైనింగ్ కొత్త లీజులను నిషేధిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేస్తూ ఇలాంటి పాక్షిక చర్యలతో ప్రయోజనం ఉండదని క్షీరసాగర్, రావుల వెంకయ్య అన్నారు. సుప్రీం విచారణ ముగిసేంత వరకు రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ గుండా ఆరావళిపై మైనింగ్ పూర్తి నిషేధానికి డిమాండ్ చేశారు. ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిన కేంద్ర పర్యావరణ, అటవీ, వతావరణ మార్పుశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు పదవిలో కొనసాగే నైతిక అర్హతలేదన్నారు. అడవులు, వన్యప్రాణుల కారిడార్లు, వాటర్‌షెడ్లు సహా ఆరావళి పర్వతశ్రేణి మొత్తాన్ని పరిరక్షించాలన్నారు. ఇది ఆరావళి కోసం జరిగే పోరాటం కాదని, రైతులు-ఆదవి బిడ్డల బతకు పోరాటమని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య పేర్కొన్నారు. ఆరావళి పరిరక్షణ కోసం పాటుపడే పర్యావరణ సంఘాలకు, పౌరులకు ఏఐకేఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు.

కార్మిక కోడ్‌ల ముసాయిదా నియమాలు

నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కొత లేబర్ కోడ్‌ల ముసాయిదా నియమాల (డ్రాఫ్ట్ రూల్స్)ను కేంద్రం నోటిఫై చేసింది. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన నాలుగు కోడ్‌ల నిబంధనలపై అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి నాలుగు కార్మిక కోడ్‌లు అమల్లోకి తెచ్చేందుకుగాను ఈ నిబంధనలను కేంద్రం ప్రచురించింది. ఉమ్మడి జాబితాలోకి వచ్చే అంశం కావడంతో ఆయా రాష్ట్రాలు కూడా ఈ నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020కి 30 రోజులు, మిగిలిన మూడు కోడ్‌లకు 45 రోజుల గడువు ఇచ్చింది. గతంలో రాష్ట్రాలు ముసాయిదా నిబంధనలను ప్రచురించినప్పటికీ.. కొన్ని నెలలు గడిచిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మళ్లీ నియమాలను ప్రచురించాలి. లేబర్ కోడ్‌లను నోటిఫై చేసేంత వరకు పాత చట్టాలు అమల్లో ఉంటాయి. ఈ కోడ్‌లలో వేజ్, అలవెన్స్, గ్రాట్యుటీ నిబంధనలను పొందుపరిచారు.

'వేజ్' నిర్వచనం.....:కొత్త లేబర్ కోడ్‌లలో 'వేజ్' అనే

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.